*Master K. Parvathikumar*

మాస్టర్ కె. పార్వతీకుమార్

# శ్రీ శాస్త్రిగారు

(ఒక నిగూఢ యోగి కథ)

# *Sri Sastry Garu*

"Story of a Disciple"

ధనిష్ఠ

*DHANISHTHA*

ప్రథమ ముద్రణ : 2003 -
ప్రతులు :

అన్ని హక్కులు గ్రంథకర్తవి.

వెల : రూ॥ **40-00**

ప్రాప్తిస్థానము :
జగద్గురు మందిరము
(ది వరల్డ్ టీచర్ టెంపుల్)
'రాధామాధవమ్', 14-38-2, ముప్పిడి కోలనీ,
విశాఖపట్నం - 530 002.

ముద్రణ :
ఎక్వేరియన్ ప్రింటింగ్ స్కూల్
విశాఖపట్నం - 530 016.
☏ 2747320, 2751329.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శృతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"**, డా॥ కంభంపాటి పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపము లోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - *"జగద్గురు మందిరము"* గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## *సంకలనకర్త : మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్*

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగా భ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయు లకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకు మించి యున్ననూ, పలు రకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియ వచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసర ణీయమై, ఆచరణయోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా రంగము లలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే, దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన అర్థం యిదేనని శ్రీ కుమార్‌గారు తమ ప్రవర్తన

ద్వారా తెలియపరచు చున్నారు. శ్రీ పార్వతీకుమార్ బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింప జేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింప జేయు వైద్యులు, అనేక గ్రంథముల సంకలనకర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొను చుండుననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు శ్రీ కుమార్‌గారి దృఢవిశ్వాసము. విశేష పరిజ్ఞానము గల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

శ్రీ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "*పరహితము పరమధర్మ*" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవధ్యానము, స్వాధ్యాయము, పరహితము లకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచ మున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠా ఫౌండేషన్**

# తొలి పలుకు

మానవుని అవిద్య నుండి, అజ్ఞానం నుండి వెలుగు మార్గం వైపుకు నడిపించే ప్రక్రియనే యోగమంటారు. ఆ మార్గంలో ప్రయాణించే సాధకుడు తనను తానే కలుసుకుంటాడు. అతని భావనాత్మక ఆలోచనలు (స్వభావము) బుద్ధికి సంబంధించిన ఆలోచనలు ఆ జీవిని స్వేచ్ఛగా సహజ స్థితిలో ఉండనీయక అడ్డుపడుతూ వుంటాయి. వెలుగుబాటలో ప్రయాణించే మానవుడు తనను తాను మార్చుకునే ప్రయత్నంలో నిమగ్నుడై వుంటాడు. లౌకిక ప్రపంచంలోని ఏ బంధాలకు వశం కాకుండా ఆత్మ సౌందర్యాన్ని చూడటం కోసం తనను తాను ఉలితో చెక్కుకునే ప్రయత్నమే ఇది. శిలలో దాగివున్న శిల్పాన్ని బయటికి తీసుకువచ్చే ప్రయత్నమే ఇది. అలాంటి మనిషికున్న స్వాతంత్ర్యం, స్వేచ్ఛ కూడా ఎదుటివారి పట్ల తాను నెరవేర్చవలసిన కర్తవ్యములతోనే ముడిపడి వుంటుంది.

కర్తవ్యం లేని స్వేచ్ఛయే మానవుని అరాచకతకు కారణమైంది. హక్కులకే ప్రాధాన్యతనిస్తూ, వాటినే కోరుతూ, కర్తవ్యాలను అలక్ష్యం చేయడంతో పరిస్థితి అస్తవ్యస్తమవుతూ వుంది. కర్తవ్య నిష్ఠ లేకనే స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను కోరటం ప్రజలకు శాపంగా మారింది. సమాజంలోని మేధావులు,

పెద్దలు, కర్తవ్యమార్గం గురించి ఆలోచించడానికి ఇది సరైన సమయం. ప్రాథమిక హక్కుల దినోత్సవాన్ని ఆచరించటం కంటే ప్రాథమిక కర్తవ్యముల దినోత్సవాన్ని కోసం ఒక్కరోజు కేటాయిస్తే అది చాలా ఉత్తమం. కర్తవ్యాలు మోక్ష మార్గాన్ని సూచిస్తాయి. వెలుగుబాటకు దారితీస్తాయి. అందుచేత సంస్కారవంతులైన, వివేకవంతులైన ప్రజలందరూ ఈ విషయం గురించి పునరాలోచన చేయవలసిన అవసరం ఎంతైనా వుంది.

సంస్కారవంతులైన మహా వ్యక్తులు తమ చుట్టూ వున్న సంఘజీవుల కోసం తల్లిదండ్రుల్లాగా, కుటుంబ సభ్యులలాగా, స్నేహితులలాగా తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తారనటానికి ఎన్నో ఉదాహరణలు వున్నాయి. అలాంటి వారి జీవితం సందేశాత్మకంగా వుంటుంది. అంతేకాక అనుసరణీయంగా కూడా వుంటుంది. అలాంటివారే జ్యోతిర్మార్గంలో వున్న యోగులు.

నిజమైన యోగ సాధకుడు తన ఆంతర్యంలో వెలుగుతున్న జ్యోతిని బయటికి కనబడనీయకుండా గంభీరంగా జీవిస్తూ, లోలోపల ఆ వెలుగును పెంచుకునేలా కర్తవ్య నిర్వహణ చేస్తుంటాడు. అలాంటి వారు ప్రశాంతంగా, సాధారణంగా (నిగూఢంగా) వుంటూ వెలుగును మాత్రం కార్యరూపంలో బయటికి ప్రసారం చేస్తారు. సంఘంలో కూడా ప్రత్యేక వ్యక్తులవలె కనబడకుండా సామాన్య వ్యక్తుల వలెనే జీవిస్తూ

వుంటారు. 'సామాన్య ప్రజలలో ఒకడుగా వుండటమే జ్యోతిర్మార్గ ప్రవేశంలో గల రహస్యం' అన్నారు పరమ గురువులు మైత్రేయ మహర్షి.

ఆ మైత్రేయవాణికి ఉత్తమ నిదర్శనమే శ్రీ కె.వి. శాస్త్రిగారు. సాధారణ, సంసారిక జీవితం గడుపుతూ వెలుగు మార్గంలో నడవటానికి ప్రయత్నం చేసేవారికి శ్రీ శాస్త్రిగారి జీవిత చరిత్ర ఉత్తేజకరంగా వుంటుంది. సత్యాన్ని తెలుసుకోవటానికి సరళత్వం కావాలి. సరళత్వాన్ని గురించి పాఠకులు శాస్త్రిగారి జీవితంలో గడిచిన ఎన్నో సన్నివేశాల ద్వారా తెలుసుకోవచ్చు.

పాశ్చాత్య యోగసాధక బృందం కోరిక మేరకు ఈ రచన ఆంగ్లంలో ప్రచురింపబడింది. దీనిద్వారా స్ఫూర్తి పొందాలని భావించే తెలుగు సాధకులకు తెనుగున, కన్నడ సాధకులకు కన్నడంలోను ఈ కథ అందించబడింది.

**– ధనిష్ఠ**

# శ్రీ శాస్త్రిగారు

"నిరంతర శ్రీ సీతారామచరణసేవా మారుతి, హరిరామ కలిసంతరణ మహాయజ్ఞ స్వరూపులు, నిరంతర పుణ్య నిత్య జీవనులు, కైలాసవాసి, బ్రహ్మశ్రీ వేదమూర్తులు శ్రీ శాస్త్రిగారు"

– మాస్టర్ ఇ.కె.

# 1

# పరిసరాలు

'**శం**భూ' అని పిలిచింది బామ్మ. పడకపై నుండి కళ్ళు తెరచినప్పటి నుండీ కూర్చున్నా, నిలబడ్డా ఆవిడ పిలిచే పిలుపు అదే. బామ్మగారి పిలుపుకు ఆ ముద్దుల మనుమడు 'ఊఁ' అంటూ ఉయ్యాలలో నుండే సమాధానమిచ్చేవాడు. అప్పుడా బామ్మ తన అల్లరి మనవడిని చూసి చిరునవ్వు నవ్వితే దానికి జవాబుగా ఆ మనవడు కూడా చల్లగా చిరునవ్వు నవ్వేవాడు. 'శంభూ' అన్న కరుణపూరిత పదానికి స్పందించిన ఆ శిశువు శంభుడయ్యాడు. ఆ శిశువునకు తల్లిదండ్రులు పెట్టిన పేరు వేంకటప్పయ్య శాస్త్రి. 'శంభు' అన్న పదం విశ్వాత్మక చైతన్యంలో శాంతినిచ్చే పదం కావడంతో, అంతేకాక దానికి ఆ మనవడు స్పందించడంలో ఆ పేరే అతడికి స్థిరపడిపోయింది. శిశుప్రాయం నుండి దైవ నామానికి ప్రతిస్పందించే జీవతత్త్వమా జీవిది.

ఆ అబ్బాయి ఇంట్లో చేసే ప్రతి దైవకార్యంలోనూ ఉత్సాహంగా పాల్గొనేవాడు. తన ఐదవ ఏట అడుగుపెట్టగానే చిన్నవాళ్ళకూ, పెద్దవాళ్ళకూ తనకు చేతనైన సహాయంచేస్తూ

తల్లిదండ్రుల ప్రేమను, బామ్మ తాతయ్యల ఆప్యాయతను పొందాడు.

అది ఇరవయ్యో శతాబ్దపు మొదటి భాగం. ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా బాపట్ల తాలూకాలోని పచ్చని పొలాల మధ్యగల పల్లెటూరు. ఆ పల్లెలో అన్ని వర్ణాలు, వర్గాల వారూ చేరి దాదాపు వెయ్యి మంది జనాభా గల ప్రాంతమది. అక్కడ నాలుగు వర్ణాశ్రమ ధర్మాలకు సంబంధించిన మేధావి వర్గము, రాజకీయ వర్గము, వాణిజ్య వర్గము ఇంకా ఇతర వర్గాల వారున్నప్పటికీ, తమకున్న హద్దులను, నియమాలను, రాజ్యాంగాన్ని అర్థం చేసుకొని సామరస్యంతో జీవించే వాతావరణం అక్కడ కనిపించేది. ఆ చిన్న సమాజంలోని పెద్దలు పిల్లలపట్ల ప్రేమగా వ్యవహరించేవారు. అలాగే చిన్నవాళ్ళు కూడా పెద్దల యెడల వినయ విధేయతలతో వ్యవహరించేవారు. చుట్టూ పచ్చని పంట పొలాలతో సమృద్ధిగా వున్న ఆ పల్లెసీమ భారతదేశానికే 'అన్నపూర్ణ' అనిపించుకున్న ఆంధ్రరాష్ట్రంలో ఒక భాగంగా వుంది. మంచి మాగాణి భూమిగల ఆ పల్లె నిరంతరం ప్రవహించే పవిత్ర కృష్ణానదీ జలాల ఆసరాతో అలరారుతూ వుండేది.

ఆ గ్రామ జీవితం అక్కడున్న శివాలయం చుట్టూ అల్లుకొని వున్నది. ఆ శివాలయంలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఆధ్యాత్మిక, సామాజిక మరియు సాంస్కృతిక

కార్యక్రమాలెన్నో జరిగేవి. వాటితోబాటు విద్యాబోధన మరియు చికిత్సా కార్యక్రమాలు కూడా నిర్వహింపబడేవి. అలాగే సుదీర్ఘ చర్చల తరువాత గ్రామానికి సంబంధించిన ప్రముఖ నిర్ణయాలను కూడా ఆ దేవాలయ ప్రాంగణంలోనే తీసుకొనేవారు. 'సంతోషీ సదా సుఖీ' అన్నట్లు ఆ గ్రామ ప్రజలు ఉన్నదానితో తృప్తిపడుతూ సంతోషకరమైన జీవితాన్ని గడిపేవారు. అందువల్ల గ్రామంలోని ఆ దేవాలయం అన్ని కార్యక్రమాలకు కేంద్ర స్థానమై వుండేది. ప్రతి ఏటా పంట చేతికి రాగానే రైతులు ముందుగా తమ ధాన్యపు బండ్లను శివాలయానికి తీసికెళ్ళి తమపట్ల దైవం చూపిన కరుణకు కృతజ్ఞతగా పండిన పంటలో కొంత భాగాన్ని దేవుడికి అర్పించి, మిగిలిన భాగాన్ని ప్రసాదంగా భావించి ఇంటికి తీసుకెళ్ళేవారు. ఇలా సేకరించిన ధాన్యాన్ని దేవాలయ కార్యకర్తలు కూడా సమాజాభివృద్ధి కార్యక్రమాలకే వినియోగించే వారు.

ఆ పల్లె ప్రజలు క్రమశిక్షణతో కూడిన సమాజ జీవితాన్ని గడిపేవారు. పండితులు మాట్లాడే భాష సంస్కృతమైతే సామాన్య ప్రజలు మాట్లాడే భాష తెలుగు. ఆ ముగ్ధ ప్రజలకు ఇంగ్లీషు, హిందీ భాషల పరిచయం లేదు. ఆ పల్లెలో 'మట్టిచెట్లు' ఎక్కువగా వుండటంతో ఆ గ్రామానికి **'మట్టిపూడి'** అన్న పేరు సార్థకమైంది. మట్టిచెట్టు పవిత్రమైనదని, దైవీశక్తుల నిస్తుందన్న విశ్వాసం ఆ ప్రజలకు వుంది.

ఆ పల్లెకు చెందిన 'కంభంపాటి' వారి కుటుంబంలో 'శంభు' అనే చిన్నిబాబు జన్మించాడు. ఆ బాబు శ్రీ జగన్నాథ శాస్త్రి మరియు శ్రీమతి పార్వతమ్మ అనే పుణ్య దంపతుల నోముపంటగా, రెండవ సంతానంగా 14-11-1916లో 'మట్టిపూడి' గ్రామంలోనే జన్మించాడు. పుట్టిన బిడ్డకు 'వెంకటప్పయ్య శాస్త్రి' అని నామకరణం చేశారు. 'వెంకట' అంటే పాపాలను తొలగించే వాడని, 'అప్పయ్య' అంటే 'తండ్రి' అనీ అర్థముంది. ఆ పేరు దేవుడికి సంబంధించినదైనప్పటికీ 'పాపాలను తొలగించే తండ్రి' అన్న అర్థానిస్తుంది. భారతదేశంలో ఆడపిల్లలకు కాని మగ పిల్లలకు కాని దేవుడి పేరు పెట్టటం పరిపాటి. ఆ కుటుంబానికున్న అపారమైన ఆధ్యాత్మిక జ్ఞానం ఆధారంగా 'శాస్త్రి' అన్న బిరుదు కూడా ఆ కుటుంబం వారికి ఇవ్వబడింది.

అప్పట్లో ఆ పల్లె ప్రయాణ సౌకర్యములు అంతగా వుండేవి కావు. కేవలం ఎద్దుబండ్లు మాత్రమే వుండేవి. విద్యుచ్ఛక్తి సౌకర్యం లేదు. టెలిఫోన్, రేడియో అంటే తెలియదు. ఆ ప్రజలకు 'టెలిగ్రామ్' పరిచయం వుంది కాని ఆ పల్లెలో ఆ సౌలభ్యం కూడా లేదు.

# 2

## కుటుంబ జీవితం

శంభుడి కుటుంబం ఆ పల్లెలో సహాయ సహకారాలకు పుట్టినిల్లుగా వుండేది. శంభుడి తండ్రి శ్రీ జగన్నాథ శాస్త్రిగారు విద్యావంతులేకాక పరమ నైష్ఠికులు. తాను, తల్లి, నలుగురు మగ పిల్లలు, ఒక్క అమ్మాయి వున్న ఆ కుటుంబాన్ని పోషించ టానికి ఆయన ఎస్టేట్ మేనేజర్‌గా వుద్యోగం చేసేవారు. అంతకు మునుపు ఆయన బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో 'రెవెన్యూ ఇన్‌స్పెక్టర్'గా పనిచేసేవారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనవలెనన్న జాతి నేతల పిలుపుకు ప్రతిక్రియగా చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రైవేట్ సంస్థలలో పనిచేశారు. ఎన్నో శాస్త్రాలను అధ్యయనం చేసిన జ్ఞాని కావడంతో ఆర్య ధర్మాన్ని నిష్ఠగా అనుసరించేవారు. ధ్యానమే ఆయన శక్తి. క్రమం తప్పకుండా ప్రతిరోజు రెండు పూట్లా ఆయన ధ్యానం చేసేవారు. వేదాధ్యయనంతోబాటు శాస్త్ర విషయాలకు సంబంధించిన చర్చలలోనూ సామూహిక గోష్ఠులలోను చురుకుగా పాల్గొనేవారు. ఆయనకు 'పూర్ణయోగి' అనిపించుకున్న తండ్రి శ్రీ సీతారామ శాస్త్రిగారి నుండి 'ధ్యాన యోగా'నికి దీక్ష కూడా లభించింది.

శ్రీ సీతారామశాస్త్రిగారు వేద విద్యలోను, యోగము లోను, సంస్కృత భాషలోను ప్రకాండ పండితులు. ఆయన తమ జీవితాంతం వేద విజ్ఞానాన్ని, యోగవిద్యను ప్రచారం చేశారు. పల్లె ప్రజలకు సంస్కృతాన్ని నేర్పేవారు. జ్యోతిశ్శాస్త్రరీత్యా ముఖ్యమైన దినాలలో ఆధ్యాత్మిక చర్చా గోష్ఠులను ఏర్పాటు చేసేవారు. అనేక యజ్ఞాలతోబాటు సత్ర యాగాలను కూడా నిర్వహించేవారు. సత్రయాగమంటే 'సామూహిక సహజీవనం' అని అర్థం. దాన్నే బృందజీవనమని కూడా అంటారు. ఈ బృంద జీవనాన్ని ప్రశాంత నిశ్శబ్ద వాతావరణంలో మూడు లేదా ఏడు దినముల వరకూ జరిపించేవారు. సత్యాన్వేషకులు లేదా సాధకులు అక్కడ చేరి తమ తమ అభిప్రాయములను వెలిబుచ్చుతూ, ధ్యానం చేస్తూ సామూహికంగా పూజాది కార్యక్రమాలను నిర్వహిస్తూ, తమకన్నా ఎక్కువ ఔన్నత్యాన్ని పొందిన మేధావుల ప్రవచనాలను వినేవారు. ఆ ప్రవచనాలు ఆలోచనలలో సమన్వయాన్ని కుదిర్చి, మార్గదర్శకత్వం వహించి సాధకులు తమ సాధనా మార్గంలో ముందుకు సాగటానికి అనువుగా వుండేవి. శ్రీ సీతారామశాస్త్రి గారు ఇలాంటి ఎన్నో బృంద జీవనాలను ఏర్పరచి, అందులో పాల్గొనే సాధకులకు భోజన వసతి సౌకర్యములను ఏర్పాటు చేయటమేకాక వారికి తగిన సూచనలను కూడా ఇచ్చేవారు. ఆయన వూళ్ళో వున్న శివాలయ నిర్మాణానికి, నిర్వహణకు ఉపయోగపడేలా మంచి మాగాణి భూమిని దానంగా ఇచ్చారు.

విశాలమైన తమ స్వంత ఇంట్లోనే పల్లె పిల్లల చదువుకోసం ప్రాథమిక పాఠశాలను ప్రారంభించి శిక్షణనిచ్చి ప్రోత్సహించారు.

యోగమునందు నిష్ణాతులగుట వలన వారు యోగాధి దేవత అయిన శ్రీ దత్తాత్రేయుని జయంత్యుత్సవములను మార్గశిర మాసంలో వారము రోజుల పాటు నిర్వర్తిస్తూ వుండేవారు. మార్గశిర శుద్ధ అష్టమినుండి, పౌర్ణమి వరకూ సప్తాహం జరుపుచుండెడివారు. అందు ఏకాదశి వైకుంఠ ఏకాదశిగాను, త్రయోదశి శివ ముక్కోటిగాను, పౌర్ణమి దత్త పౌర్ణమిగను నిర్వర్తించేవారు. ఉదయం, సాయంత్రం ప్రార్థనలు, అగ్ని హోత్రములు, షోడశోపచార పూజలు, అన్నదానము, వస్త్ర దానము, ఆధ్యాత్మిక ఉపన్యాసములతో ఆ 7 రోజులు ఒక మహోత్సవంగా సాగేది. శ్రీ సీతారామశాస్త్రి గారు నిర్వహించే ఈ ఉత్సవాలు గుంటూరు, కృష్ణా జిల్లాలలో మట్టిపూడి గ్రామాని కొక విశిష్టతను చేకూర్చాయి. వారు యోగాచార్యులుగ, ప్రబోధకు లుగ, వైదిక విజ్ఞానవేత్తలుగా, బ్రహ్మజ్ఞానిగ పేరు గాంచినారు.

శ్రీ సీతారామశాస్త్రిగారు ఆ పల్లెలో అన్ని పనులూ చక్కగా నిర్వహించేవారు. ప్రాథమిక విద్య మొదలు వైదిక విద్య వరకూ బోధనా తరగతులను నిర్వహిస్తూ, వివిధ సంక్షేమ కార్యక్రమాలను రూపొందిస్తూ తమ సహాయ సహకారాలను అందించేవారు. వేదాలకు సంబంధించిన క్రతు విద్యలను, యోగాభ్యాసాన్ని చాలామందికి నేర్పించారు. ఆ కాలంలోనే ఆ

పల్లెలో ఆయన దానగుణానికి మారుపేరు అని అనిపించు కున్నారు. ఆ గ్రామానికి సమీపంలోనే వున్న 'బాపట్ల'లో అష్టాంగ యోగాన్ని నేర్పడానికి ప్రత్యేక విద్యాలయాన్ని ప్రారంభించారు. సాధకుల సందేహాలను నివారిస్తూ, వారికి దీక్షనిస్తూ యోగ మార్గంలో ముందుకు వెళ్ళటానికి అవసరమైన సూచన లిచ్చేవారు. ఇలా ఆధ్యాత్మిక, సామాజిక మరియు సాంస్కృతిక కార్యక్రమా లను రూపొందించటంలో ఆయనకు ఆయనే సాటి. సింహం లాగా జీవించి ప్రజ్ఞా పూర్వకంగానే భౌతిక శీరీరాన్ని త్యాగం చేశారు. తండ్రిగారైన శ్రీ సీతారామ శాస్త్రిగారి జీవన విధానము, కార్యదీక్ష, దక్షతను చూచి ఉత్తేజితులైన శ్రీ జగన్నాథ శాస్త్రిగారు పతంజలి యోగసూత్రాలలో చెప్పబడిన విధంగా ధ్యానం చేస్తూనే ఆ ప్రక్రియపై సంపూర్ణ ఆధిపత్యాన్ని పొందారు. ఆయన అంతరంగంలో సంప్రదాయంతో కూడిన నిష్ఠాగరిష్ఠులు. అయినప్పటికీ కాలంతోపాటు వచ్చే మార్పులను అంగీకరించే వారు. అప్పట్లో ఇంగ్లీషు చదువు, తెల్లదొరల జీవన విధానము భారతీయ సమాజంపై చాలా ప్రభావాన్ని చూపేవి. ఆయన తన సంప్రదాయాన్ని వదలుకోలేదు. కాని కాలానుగుణంగా తమ జీవన విధానాన్ని (ట్రెండ్స్) రూపొందించుకొనే అవకాశం తమ పిల్లలకు కల్పించారు. 'బయటకు మీరు పాశ్చాత్య వ్యవహారాలను అనుసరించినా, హృదయంలో మాత్రం ఎప్పటికీ భారతీయుడవై వుండు' అని పిల్లలతో పదేపదే చెప్పేవారు. ఇంట్లోను, మనసులోను కూడా భారతీయతనే నింపుకొని బయట

సమాజంలో పనులు నిర్వహించేటప్పుడు అవసరమైతే మాత్రం ఇతర పద్ధతులను అనుసరించవలసిందని చెప్పేవారు. పాశ్చాత్య యంత్ర విజ్ఞానాన్ని ఉపయోగించుకున్నా ఆత్మ మాత్రం భారతీయ తత్త్వం నుండి దూరం కాకూడదన్నదే వారి సలహా. ప్రాచ్య పాశ్చాత్య సంస్కృతుల మధ్య సామరస్యంతో కూడిన సమన్వయం వుండాలన్నదే వారి భావన.

శ్రీ జగన్నాథ శాస్త్రిగారు కూడా తమ తండ్రిలాగే తీవ్రంగా ఆంతరిక సాధన చేశారు. తీవ్రమైన, గంభీరమైన ధ్యానాన్ని ఆచరిస్తూ అమరత్వాన్ని పొందాలన్నదే ఆయన లక్ష్యం. బయటి వ్యక్తిత్వాన్ని పెంచుకోక, దాన్ని పరిమితం చేసి, యోగాభ్యాసంతో ఉన్ముఖత్వాన్ని సాధించటానికి ఎక్కువ సమయం కేటాయించేవారు. ఆయన మృదుస్వభావం గలవారైనప్పటికీ యోగ్యవ్యక్తిగా, నిష్ఠావంతుడైన వ్యక్తిగా గుర్తింపబడ్డారు. తమ కుటుంబ జీవితంలో ఉత్తమ గృహస్థుడిగా, పిల్లలకు స్నేహాన్ని అందించే తండ్రిగా, భార్యపట్ల ప్రియతమ భర్తగా వ్యవహరించే వారు. ఆయన జీవిత భాగస్వామియైన శ్రీమతి పార్వతమ్మ కూడా ఆయన జీవితంలోని ఎన్నో సన్నివేశాలలో ప్రముఖపాత్ర వహించేవారు. దైవంపై ప్రగాఢ భక్తి విశ్వాసాలు గల శ్రీమతి పార్వతమ్మ భర్తకు వచ్చే ఆదాయం తక్కువైనా ఇంటి వ్యవహారాలను ఎంతో నేర్పుగా నడిపేవారు. భర్తను ప్రేమతో అర్థం చేసుకొని ఆయనకు తన సంపూర్ణ సహకారాన్ని అందించే మహా ఇల్లాలు

ఆవిడ. విశాల హృదయం గల ఆ ఇల్లాలు తక్కువ జీతంలోనే అందరికీ జీవిత వైభవాన్ని చవిచూపింది. ఆదర్శవంతమైన తల్లిగా, ప్రోత్సహించే భార్యగా అన్నిటికంటే ఉత్తమ స్త్రీగా జీవితాన్ని గడిపారు. ఆమె ప్రోత్సాహంతోనే శంభుడి తండ్రిగారైన శ్రీ జగన్నాథశాస్త్రి గారు సూక్ష్మ లోకాలవైపు అంతర్ముఖ ప్రయాణం కొనసాగించగలిగారు. శ్రీమతి పార్వతమ్మలోని ఆధ్యాత్మిక ప్రకాశాన్ని గుర్తించి ఆమెద్వారా తమ వంశాభివృద్ధి అవుతుందనీ అలాగే తన తరం కూడా ఆధ్యాత్మిక ప్రగతిని సాధించాలన్న కోరిక కూడా తీరుతుందని తెలుసుకున్న శ్రీ సీతారామ శాస్త్రిగారు ఆమెను రెండవ కోడలిగా తమ ఇంటికి తెచ్చుకున్నారు. అలాగే శ్రీమతి పార్వతమ్మ కూడా ఆ ఇంట్లోని అన్ని కార్యక్రమాలలోను మెరుపులా ప్రకాశించారు. తండ్రికి, గురువులకు ఎలా సేవ చేసేవారో అలాగే మామగారైన శ్రీ సీతారామశాస్త్రిగారికి కూడా సేవ చేసేవారు. మామగారికి, భర్తకు, పిల్లలకు, బంధువులకు, స్నేహితులకు కూడా సరళ హృదయంతో భక్తి పూర్వకంగా చేసిన సేవకు ప్రతిఫలంగా ఎంతో జ్ఞానాన్ని పొందారు. సీతారామశాస్త్రి గారిచే ప్రభావితులై ఆయన దర్శనం కోసం ఎంతోమంది ఇంటికి వచ్చేవారు. ఆ ఇంటి దీపంలా నిలిచిన శ్రీమతి పార్వతమ్మ వచ్చిన వారందరికీ శ్రద్ధగా అతిథి మర్యాదలను జరిపేవారు. భర్త నడిచేది ధ్యాన మార్గము. ఆమె నడచినది భక్తి మార్గము. ఆమె పనులు చేసుకొంటూనే, భాగవతములోని ఉపాఖ్యానములన్నీ పారాయణ చేస్తూ వుండేది.

ఆమెకు దాదాపు భాగవతంలోని అన్ని ఉపాఖ్యానములు కంఠోపాఠము. ఆమె నలుగురి కుమారులలో శంభుడు మాత్రమామెను చేరి చిన్నతనంలోనే భాగవత పద్యాలను హృదయస్థం చేసుకున్నాడు. పార్వతమ్మ గారి పోలికలో పుట్టిన వాడు నలుగురి కుమారులలో శంభుడొకడే! ఆయన తల్లి కొడుకు గానే మసిలారు. తండ్రికి శంభుడి మీద విశ్వాసం. శంభుడికి తల్లిమీద ప్రేమ! తండ్రి మీద గౌరవం.

ఇలా క్రమంగా జగన్నాథ శాస్త్రిగారు బాహ్య జీవితంలోను, ఆంతరిక జీవితంలో కూడా ప్రగతిని సాధిస్తూ ముందుకు సాగేవారు. తమ పిల్లలు ఐదు మందికీ ఉద్దేశ్యపూర్ణమైన మరియు మహత్తరమైన జీవితం గడపటానికి కావలసిన సూచన లిస్తూ కుటుంబంపట్ల తమ కర్తవ్యాన్ని చాలా చక్కగా నిర్వహించే వారు. ఆంతరిక పరిపూర్ణత్వాన్ని పొందటానికి నిరంతరం యోగాభ్యాసం చేసేవారు. జీవితంలో సగం వయస్సు వచ్చేసరికి (50వ ఏట) తాము జీవితంలో ఏమి సాధించాలని ఆకాంక్షించారో అది తన హృదయ గహ్వరంలో (స్వస్వరూప దర్శనం) పొందారు. ఆ తరువాత ఆయన ధ్యానం ఇంకా తీవ్రంగా, ప్రగాఢంగా ముందుకు సాగింది. జీవితపు చివరి దినాల్లో ఆయన భౌతిక శరీరం ధ్యానము చేసేటపుడు గాలిలో తేలుతూ వుండేది (Levitation). ఆ సమయంలో ఆయన ముఖంలో అపూర్వ తేజస్సు కనిపిస్తూ వుండేది. అదే సాధన. శాస్త్రీయమైన సంప్రదాయబద్ధమైన సాధన. దాన్ని సాధించటానికి

తాత్త్విక శక్తి (Psychic Energy) యొక్క సంపూర్ణ అవగాహన వుండాలి. పరిణామం యొక్క రాబోయే దశలలో మానవుడు ఏదో ఒకనాడు గాలిలో తేలే స్థితికి తప్పక చేరుకుంటాడు. ఈ సన్నివేశం జరిగిన రోజు గాలిలో తేలిపోవాలన్న ఆలోచనకు సరియైన రూపం వస్తుంది. ఇది జరిగి తీరవలసిన పరిణామమే నని జ్ఞానులు, పరమ గురువులు చెప్పిన భవిష్యవాణి జగన్నాథ శాస్త్రిగారి జీవితములో సార్థకమైనట్లుగా భావింపవచ్చు.

శ్రీ జగన్నాథ శాస్త్రిగారు మరియు శ్రీమతి పార్వతమ్మ ఇద్దరూ సాధారణ జీవితం గడుపుతూ దేవుడిపై ప్రగాఢ విశ్వాసాన్ని పెంచుకొని చేసే ప్రతి పనీ దైవ కార్యమనే భావించే వారు. ఆ దంపతులలో మొదట శ్రీమతి పార్వతమ్మ దేహత్యాగం చేయగా తరువాత ఐదేళ్ళకు జగన్నాథ శాస్త్రిగారు దేహత్యాగం చేశారు. ఆయన జీవన విధానము అలాగే పరిపూర్ణ దైవత్వంతోనే ముగిసిన ఆయన ఇహలోక యాత్ర ప్రజలకు స్ఫూర్తినిచ్చే అంశాలు. ఆ కాలపు లెక్క ప్రకారం ఆయన వృద్ధుడూ కాదు. యువకుడూ కాదు. ఆ దంపతులు తమ జీవితాన్ని త్వరగా ప్రారంభించి తమ తమ కర్తవ్యాలను సక్రమంగా ముగించి ఒకరు నలభయ్యవ పడిలో మరొకరు యాభయ్యవ పడిలో ప్రజ్ఞా పూర్వకంగానే జీవన యాత్రను ముగించారు. వారి జీవనయాత్ర ముగింపు వివరింపవలసిన విషయమే మరి.

శ్రీమతి పార్వతమ్మ తాను దేహత్యాగం చేసే సమయం గురించి ఒకరోజు ముందుగానే తమ తల్లికి, భర్తకు తెలియ జేశారు. వేరే వూళ్ళో వున్న తల్లిని పిలిపించి ఆమెతో ఒక్కరోజు గడిపారు. తనకు పిలుపు వచ్చిందని భర్తకు తెలియజేశారు. మరుసటి రోజు ఉదయం ప్రార్థనను ముగించి పెరట్లో వున్న తులసికోట దగ్గర కూర్చుని తల్లికి, భర్తకు నమస్కారం చేసి కాసేపు కళ్ళు మూసుకున్నారు. ఆ తరువాత కొద్ది క్షణాలలోనే కళ్ళు మూసుకున్నారు. ఆ తరువాత కొద్ది క్షణాలలోనే కొన ఊపిరి వదిలారు. ఇలా ఆమె దేహత్యాగం ఆమెకు తెలిసే జరిగింది. దేహత్యాగ సమయంలో కూడా ***'అనాయాసేన మరణం, వినాదైన్యేన జీవనం, దేహంతే తవ సాయుజ్యం'*** అన్నట్లుగా ఆమె ఏ కష్టాన్నీ, బాధను అనుభవించలేదు. దహన సంస్కారం జరిగేదాకా ఆమె ముఖంలో చిరునవ్వు చెదరలేదు. భౌతిక జీవితంలో ఎన్నో కష్టాలు ఎదురైనా ఎలాంటి ఆందోళనా చెందని శాంతిపూర్ణమైన మృదుస్వభావం గల హృదయం ఆమెది.

యాభైఏళ్ళ జీవితాన్ని గడిపిన జగన్నాథశాస్త్రి గారికి కాలికి దెబ్బ తగిలి, అది ఎన్నాళ్ళకూ మానక బాగా ముదిరి కాలు కుళ్ళిపోయే పరిస్థితి వచ్చింది. తన పరిస్థితిని అర్థం చేసుకున్న ఆయన పిల్లలను పిలిచి తన జీవితం పూర్తవుతూ వచ్చిందని కాలివ్యాధి తన అంతిమ సమయాన్ని సూచిస్తూ వుందని చెప్పారు. పిల్లలు తండ్రిపై గల అభిమానంతో ఆయన దేహత్యాగానికి ఒప్పుకోలేదు. అయినా ఆయన దేహత్యాగం

చేయడానికే నిర్ధారించుకున్నారు. ఎందుకంటే వచ్చిన పని పూర్తయ్యాక కూడా మానవుడు ఇంకా ఇక్కడే ఊగిసలాడుతూ వుండకూడదన్నదే ఆయన అభిప్రాయం. కుటుంబంపట్ల, సమాజంపట్ల తమ కర్తవ్యాలను సంపూర్ణంగా నెరవేర్చారు. అన్నిటికంటే ముఖ్యంగా భౌతిక శరీరం వుండగానే ఆత్మదర్శనం పొందాలన్న ఆయన ఆశయం సిద్ధించింది. ఆయనకు రెండవ కొడుకైన వెంకటప్పయ్య శాస్త్రిగారి కుటుంబంలోనే ఆధ్యాత్మిక వారసత్వం కొనసాగుతుందని అనిపించింది. అందుకనే ఆయన వెంకటప్పయ్య శాస్త్రి గారికి 'ఓం నమశ్శివాయ' అనే శివ పంచాక్షరీ మహామంత్రాన్ని ఉపదేశించారు. దానికి కారణం ఆ కొడుకు అన్నిచోట్లా తనకు గల కర్తవ్యాలను పరిపూర్ణంగా నిర్వహిస్తూ వుండటమే.

తమ కాలి పరిస్థితిని చూసి, ఇక తాను భగవంతుడి వద్దకు తిరిగి వెళ్ళటానికి సమయమాసన్నమైందని తెలుసుకున్న జగన్నాథశాస్త్రి గారు పద్మాసనంలో కూర్చున్నారు. మనసును శ్వాసలో లీనం చేశారు. అత్యున్నత స్థితియైన స్పందనంలోకి చేరటానికి మనస్సు శ్వాస రెండూ జతగూడాయి. హృదయ గుహలో గల స్పందనం సుషుమ్నలో గల సూక్ష్మ స్పందనానికి దారితీస్తుంది. ఆయన హృదయ కమలం నుండి కంఠభాగానికి సూక్ష్మ స్పందనమైన సుషుమ్న మార్గంలో ముందుకు సాగారు. సూక్ష్మ స్పందనం పైకి, ఇంకా పైకి చేరుతూ క్రింది తాలువు నుండి పై తాలువుకు చేరి అక్కడున్న ప్రతిధ్వని అనుభూతి

పొంది అక్కడి నుండి పైకి అంటే వెలుగు సామ్రాజ్యమైన ఆజ్ఞా కేంద్రాన్ని చేరింది. అక్కడి నుండి ముందుకుసాగి సహస్రార కేంద్రాన్ని చేరి ఆ తరువాత వెలుగులో లీనమయ్యారు. ఆయన ప్రాతఃకాలం అంటే సూర్యోదయం ఆరంభ సమయంలోనే దేహత్యాగం చేశారు.

ఉదయం పిల్లలు తండ్రి గదిలోకి వచ్చి చూడగా కేవలం ఆయన భౌతిక శరీరాన్ని చూచి ఎంతో ఆశ్చర్యపోయారు. శంభుడు తండ్రి తలపైని (సహస్రారం) తాకి చూసి ఆయన ప్రజ్ఞాపూర్వకంగానే రాజమార్గంలో సహస్రారం ద్వారానే వెళ్ళిపోయారని తెలుసుకున్నారు. అన్ని కర్తవ్యాలను పూర్తి చేసిన ఉదాత్తచరితుడైన, ఆత్మస్వరూపుడైన తండ్రిగారి అంత్యక్రియలను శ్రద్ధాభక్తులతో నిర్వహించారు. శ్రీ జగన్నాథశాస్త్రి గారు భగవదనుగ్రహం పొందినవారు కావటంతో ప్రజ్ఞా పూర్వకంగా దేహత్యాగం చెయ్యగలిగారు. అలాంటి వారు మరల ప్రజ్ఞా పూర్వకంగానే తిరిగి రావటానికి సాధ్యమవుతుంది. వారినే ముముక్షువులని, అమరత్వం పొందినవారని అంటారు. ఆయన కూడా తమ తండ్రిలాగే అమరత్వం పొందిన వారి శ్రేణికి చేరి దివ్య సంకల్పానికి అనుగుణంగా జీవించారు.

# 3

# దర్శనం

**ద**యార్ద్ర హృదయులైన, దైవభక్తి గల తల్లిదండ్రుల పెంపకంలో పెరిగిన శంభుడికి సహజంగానే ఆధ్యాత్మిక విషయాలలో ఆసక్తి వుండేది. అలాగే తన మంచితనంతో పల్లెలో అందరికీ కంటిలో పాపలా తయారయ్యాడు. 'పులి కడుపున మేక పుడుతుందా!' అన్నట్లుగా ఈ అబ్బాయి కూడా తాతగారిలాగానే సమాజసేవ చేస్తాడని వూళ్ళో వారందరూ అనేవారు. శంభుడు కూడా అందరికీ అన్ని పనులలో సహాయం చేసేవాడు. వయసుకు మించిన బాధ్యతలు వహించి సమాజసేవ చేసేవాడు. పన్నెండేళ్ళ వయసులో వున్న శంభుడికి ఇష్టమైన పనిని అప్పగించారు. అదేమిటంటే తమ పల్లెకు ఐదు కి॥మీ॥ దూరంలో వున్న మరో పల్లెలోని అమ్మమ్మ గారింటి నుండి కొత్తగా పెట్టిన ఆవకాయ జాడీలను తీసుకు రావటమే. అది వేసవికాలం. బస్సు సౌకర్యం లేదు. పొలాల మధ్య గల కాలిబాట గుండా నడిచి వెళ్ళాలి.

ఆవకాయ పెట్టడంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రపంచంలోనే ప్రముఖస్థానం లభించింది. ఆంధ్రులకు ఆవకాయంటే ఎంతో

ప్రాణం. అందుకే వాళ్ళను 'ఆవకాయ ప్రజలు' అంటారు. ఎన్నోరకాల ఊరగాయలు పెట్టినప్పటికీ వాటన్నటి మధ్యలో ఆవకాయ చుక్కల్లో చంద్రుడిలా వెలుగుతూ వుంటుంది. భారతీయులకు వేసవికాలమంటే మామిడి కాయల కాలమే. ఎందుకంటే వేసవిలోనే మామిడి కాపు వస్తుంది. సంవత్సరానికి సరిపడా ఆవకాయ పెట్టడంలో ప్రతి స్త్రీ వేసవిని కూడా లెక్కచెయ్యక అవిశ్రాంతంగా కష్టపడుతూ వుంటుంది. అన్ని కుటుంబాలలోనూ సభ్యులందరూ ఒకచోట ఎంతో సంబరంగా ఎన్నో జాడీల ఆవకాయ పెట్టేవారు.

ఆవకాయ పెట్టడానికి ముందు మామాడి కాయలను చిన్న చిన్న ముక్కలుగా కోసి ఉప్పులో ఊరబెట్టేవారు. ఆ తరువాత వాటికి మిరప్పొడి, ఆవపొడి, నువ్వుల నూనె చేర్చి బాగా కలిపేవారు. అన్నీ వేడిచేసే పదార్థాలే. ఆవకాయ తింటే ఒంట్లో ఉష్ణం ఎక్కువై ఎండతాపాన్ని ఎదుర్కోగల శక్తి వస్తుంది. 'వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి' అన్నట్లుగా ఉష్ణాన్ని ఉష్ణంతోను, శీతలాన్ని శీతలంతోనే ఎదుర్కోవాలి అన్న ఆయుర్వేద సత్యం ఇక్కడ కనబడుతుంది. చలికాలంలో చన్నీళ్ళతోను, వేసవికాలంలో వేడి నీళ్ళతోనూ స్నానం చేయాలన్నది ఆయుర్వేద సిద్ధాంతం. 'Similia, Similibus, Curantor' అన్న హోమియో సిద్ధాంతం కూడా ఎన్నో వేల సంవత్సరాల ప్రాచీనమైన ఆయుర్వేద సిద్ధాంతాన్ని అనుసరించింది. ఆయుర్వేదంలో విష(మ) జ్వరానికి

నాగుపాము విషంతో తయారుచేసిన మందునే ఉపయోగిస్తారు. 'ఉష్ణం ఉష్ణేన శీతలమ్' (ఉష్ణాన్ని ఉష్ణంతోనే చల్లబరచాలి) అన్నారు కదా!

ప్రదేశం యొక్క వాతావరణానికి తగినట్లుగానే ఆహారపు అలవాట్లు కూడా వుంటాయి. ఆయా ఋతువులలో లభించే కూరగాయలు, పళ్ళు, ఆహార ధాన్యాలను తినటం వలన శరీరం ఋతుధర్మానికి అనుగుణంగా తయారవుతుంది. ఆ సిద్ధాంతానికి అనుగుణంగానే పాతకాలం నుండి వేసవిలో ఆవకాయ తినే సంప్రదాయం మొదలైంది.

వేసవి కాలంలో ఆవకాయ పెట్టే దృశ్యం కంటికింపుగా వుంటుంది. ఆడవాళ్ళందరూ ఒకచోట చేరి పండుగ సంబరంతో ఉత్సాహంగా ఆవకాయకు కావలసిన వస్తువులన్నీ సేకరించుకొనే వారు, మగవారు మంచి టెంకగట్టిన కాయలను ముక్కలుగ కోసి పెట్టేవారు. దానికోసం ప్రతి యింట్లోను మామిడి కాయల్ని కోసే కత్తిపీట వుండేది. ఆవకాయ కలిపేటప్పుడు దానిపై తమకున్న ఆప్యాయతను కూడా చేర్చడంతో దాని రుచికి అంతు వుండదు. తమ వారిపై గల ప్రేమానురాగాలను ఆవకాయ పెట్టడంలో కూడా చూపేవారు. ఆడవాళ్ళందరూ ఆవకాయ పెడితే ఇంట్లోని మగవాళ్ళు, పిల్లలందరూ రుచి చూసి ఎంతో బాగుందని ప్రశంసించేవారు. ఆవకాయ పెట్టడం పూర్తయ్యాక బంధువులకు ఆవకాయ పంచడంతోపాటు ఆనందాన్ని కూడా

పంచుకునేవారు. అదీ ఒకలాగా బృందజీవనమే కదా! ఆ రోజుల్లో కుటుంబాల మధ్య ఆప్యాయత అలా వుండేది.

సుమారు పది కేజీల బరువు గల రెండు ఆవకాయ జాడీలను తమ ఇంటికి తీసికెళ్ళమని అమ్మమ్మగారు చెప్పారు. ఆ రెండు గ్రామాల మధ్య దూరం 5 కి॥మీ॥ వుంది. శంభుడు ఉదయాన్నే ఆ జాడీలను తన సున్నితమైన భుజాలపై మోసుకొని నడవటం ప్రారంభించాడు. అతడు కార్యదక్షుడని, సేవాభావంతో పాటు దృఢసంకల్పం కూడా కలవాడని పిల్లలందరి అభిప్రాయం. అమ్మమ్మ గారికి కూడా ఈ సంగతి తెలుసు. అందుకే ఆమె ఆ పనిని శంభుడికి అప్పగించారు. శంభుడు ఆవకాయ జాడీలను మోసుకొని వరిపొలాల మధ్యలో నున్న కాలిబాట వెంబడి నడువసాగాడు. ఆ జాడీలను మోస్తూనే మనస్సు, బుద్ధిని ఏకంచేసి గట్టిగా దైవస్మరణ చేయసాగాడు. ఆ భగవంతుడి వైభవాన్ని గురించిన పాటలు పాడుతూ జాడీల భారాన్ని కూడా మరచి పోయి సులభంగా ముందుకు సాగుతున్నాడు. దైవ స్మరణలో తనను తానే మరిచాడు.

అలా ముందుకు నడుస్తూ, దూరాన్ని తగ్గించుకుంటూ ఎండిపోయిన వరిచేను మధ్యలోకి ప్రవేశించాడు. అక్కడ ఒక తెల్లని నాగుపాము మిలమిలా మెరుస్తూ, పడగపై ధగధగ ప్రకాశించే మణితో కనిపించింది. (అది పాము యొక్క శరీర కాంతియా? లేక సూర్యకాంతి పరావర్తనమా?) చిన్నవాడైనా

శంభుడు భయంలేకుండా పడగెత్తిన ఆ పామునే తదేకంగా చూస్తూ వున్నాడు. అలా పామును చూస్తూ వున్నా దైవస్మరణ మరువలేదు. ఆ స్మరణ కేవలం నోటితో చేసేదికాక హృదయానికి సంబంధించినది. ఒక్కక్షణం కళ్ళు మూసుకున్నాడు. తాను గట్టిగా ఉచ్చరించకపోయినా హృదయ గుహలో వినిపించే నాదాన్ని అతడు విన్నాడు. ఆ అనాహత శబ్దాన్ని మననం చేసుకుంటు న్నాడు. అతడికి కాలమే తెలియడం లేదు. అలా ఎంతసేపు నిలుచున్నాడో! చాలాసేపటి తరువాత తేరుకొని కళ్ళు తెరచి చూశాడు. ఆశ్చర్యం! అక్కడ నాగుపాము లేదు. అతనికి భయం వేసింది. ఇది నిజమా! అని తనను తానే ప్రశ్నించుకున్నాడు. అప్పుడు హృదయంలో నుండి 'ఔను. ఇది నిజం' అన్న జవాబు కూడా వచ్చింది. అలా అయితే ఇప్పుడా పాము ఏది?' అని మరలా ప్రశ్నించుకున్నాడు. ఆ ప్రశ్నకు లోపలి నుండి జవాబు రాలేదు. తన చుట్టు పక్కల అంతా పరీక్షించి చూశాడు. కేవలం నిశ్శబ్దం మాత్రం ఆవరించుకొని వుంది. వేసవిలో ఎండిపోయిన పొలాల మధ్య తానున్నట్లు తెలుసుకున్నాడు. మళ్ళీ గట్టిగా దైవస్మరణ చేస్తూ ముందుకు సాగాడు. ఇంత భయంకరమైన సంఘటన జరిగినప్పటికీ శంభుడి భుజాలపై గల ఆవకాయ జాడీలు మాత్రం చెక్కుచెదరక భద్రంగా వున్నాయి. శంభునికి మణిగల నాగుపాము అటుపైన అప్పుడప్పుడు జీవితంలో దర్శనమిస్తూ వుండేది!

నాగు కనబడగానే శంభుని కళ్ళు వెంటనే అప్రయత్నంగా మూసుకొనేవి. ఎంత సమయం గడచిందో ఆయనకే తెలియని స్థితిలో శంభుడు ఉడిపోయేవాడు. జరిగిన సంఘటన గురించి శంభుడు చాలాసేపు ఆలోచించాడు. తాను గోచర మరియు అగోచర స్థితుల మధ్యలో వున్నట్లుగా తెలుసుకున్నాడు. మనసులో ఏది సత్యం? ఏది అసత్యం? అన్న కలవరం మొదలైంది. శంభుడు ఇంటికెళ్ళి ఆవకాయ జాడీలను తల్లికి అప్పగించి మరలా అంతరంగ నిశ్శబ్దంలోకి వెళ్ళిపోయాడు. ఎప్పుడూ చురుకుగా వుంటూ, తాను నవ్వుతూ అందరినీ నవ్విస్తూ వుండే శంభుడు గంభీరంగా తయారయ్యాడు. అలా స్తబ్దుడై వున్న కొడుకును గమనించిన తల్లి పార్వతి భర్తకు ఈ విషయాన్ని తెలియజేసింది. తండ్రి జగన్నాథశాస్త్రి గారు కొడుకు దగ్గర చేరి నెమ్మదిగా 'ఏం జరిగింది?' అని ప్రశ్నించారు. 12 ఏళ్ళ శంభుడు ఎంతో ఆశ్చర్యంగా దారిలో జరిగినదంతా తండ్రికి వివరించాడు. అది విన్న శ్రీ జగన్నాథశాస్త్రి గారికి ఎంతో సంతోషం కలిగింది. తన కొడుకు కుండలినీ చైతన్య దర్శనం పొందాడని, అందుకే కొంత చెదిరాడని అర్థం చేసుకున్నారు. ప్రశంసాపూర్వకంగా కొడుకు వెన్ను తట్టాడు. ప్రేమగా కొడుకు ఒళ్ళంతా తడిమారు. భార్యతో 'మనవాడు దైవానుగ్రహం గల పుత్రుడు. వీడొక యోగి. పుట్టుకతోనే సహజయోగి. వీడు తన జీవిత ధ్యేయాన్ని నిర్ధారించుకొన్నవాడు. అలాంటి కొడుకును కన్న మనం ధన్యులము' అంటూ కొడుకు సాధించిన విషయాన్నే స్మరిస్తూ ఆత్మానందాన్ని పొందారు.

# 4

## విద్యాభ్యాసము - ఉద్యోగము

శ్రీ జగన్నాథ శాస్త్రిగారు మారుతున్న కాలంతోపాటు మారుతున్న జీవన పద్ధతులకు అనుగుణంగా ఆంగ్ల విద్యను కూడా నేర్చుకోవలసిందిగా పిల్లలను ప్రోత్సహించారు. దానికోసం హైస్కూల్ చదువు పూర్తికాగానే శంభుడిని మోటారు వాహనాలకు సంబంధించిన తంత్ర జ్ఞానశిక్షణ సంస్థలో (ఆటోమోబైల్ ఇంజనీరింగ్) శిక్షణ పొందటానికి మద్రాసు పట్టణానికి పంపారు. అది 1930-35 ప్రాంతం. అప్పట్లో ప్రాంతీయ వాహనాలైన ఎద్దుబండ్ల సంఖ్య ఎక్కువగా వుండి మోటారు బండ్ల సంఖ్య తక్కువగా వుండేది. పెద్ద పెద్ద పట్టణాలలో ఈ మోటారు వాహనాల సంఖ్య ఎక్కువగా వుండేది. వాహనాల రిపేర్, వాటి సంరక్షణకు సంబంధించిన వాహన తంత్ర విజ్ఞానంలో శిక్షణ పొందాడు. శ్రీరామకృష్ణ మిషన్‌కు సంబంధించిన మోటారు వాహన తంత్ర విజ్ఞాన సంస్థలో చదవడమే కాక అక్కడే ట్రైనింగ్ కూడా ముగించిన విద్యార్థులకు యోగ్యతా పత్రాలను (డిప్లొమా) ఇచ్చేవారు. ఈ సంస్థ బయటి వూళ్ళ నుండి వచ్చిన విద్యార్థులకు వసతి సౌకర్యాలను ఏర్పాటు చేయటమే కాక అక్కడున్న విద్యార్థులకు ఉదయాన్నే లేవటం, యోగాభ్యాసం, ప్రార్థనా

విధులను కూడా నేర్పేవారు. స్వయం సేవా కార్యక్రమాలైన బట్టలుతకటం, పాత్రలు తోమటం, ఉపాహార భోజనాలను సిద్ధం చేసి, భోజనశాలలో అందరికీ అందించటం, వేళకు సరిగ్గా చదువుకోవటం, ఆధ్యాత్మిక చర్చలలో పాల్గొనటం మొదలైన కార్యక్రమాలలో పాల్గొనేలా చేసేవారు. అక్కడ ఎనలేని క్రమశిక్షణ కనిపించేది.

చాలామంది విద్యార్థులకు ఆ విద్యార్థి వసతి గృహం (హాస్టల్) లోని నిత్యకార్యక్రమాలు కఠినంగా అనిపించేవి. శంభుడు నెమ్మదిగా ఈ క్రమశిక్షణకు అలవాటు పడుతూ అందులోని ఆనందాన్ని అనుభవించేవాడు. శ్రీరామకృష్ణ పరమ హంస ప్రత్యక్ష శిష్యులలో ఒకరైన శ్రీ విజ్ఞానానంద స్వామిగారు ఈ విద్యార్థి వసతిగృహ కార్యక్రమాలను పర్యవేక్షించేవారు. ఆయన శంభుడిలో గల ఆధ్యాత్మిక అగ్నికణాన్ని గమనించి దగ్గరికి పిలిచారు. శంభుడికి కూడా ఆశ్రమంలోని విద్యార్థి వసతి గృహంతోపాటు స్వామీజీ సాన్నిధ్యం చాలా సంతోషకరంగా వుండేది. స్వామీజీ తమ ఆంతరిక బుద్ధి ప్రచోదనం ద్వారా శంభుడికి శ్రీరాముడి పవిత్ర మంత్ర దీక్షను ఇవ్వదలచుకున్నారు. 'శ్రీరామ' అన్నదే ఆ మంత్రం. 'రం' అన్నది అగ్నికి సంబంధించిన బీజాక్షరం. దీనిని ఉచ్చరించే వారిని ఈ మంత్రం పవిత్రీ కరిస్తుంది. దానితో మంత్రోచ్చారణ చేసే వ్యక్తిలో పరివర్తనం కనిపిస్తుంది. ఇలా పరివర్తనం ద్వారా వికాసం పొందినవారు

'సమాజంలో ప్రవక్తలవుతారు. మహాత్మాగాంధీగారు కూడా ఈ మంత్రం నుండే కార్యసాధకులయ్యారు.

'రం అన్న మంత్రం త్రేతాయుగం నుండి భూమిపై వుంది. భారతీయులకు ఇది చాలా ప్రియమైన మంత్రం. భారతీయులు కృష్ణ మంత్రం కంటే రామ మంత్రాన్నే ఎక్కువగా ఇష్టపడతారు. 'రామాయణ'మనే ఆది మహాకావ్యం కూడా త్రేతాయుగంలోనే రచింపబడింది. ప్రపంచంలో ఎన్ని శాస్త్రాలున్నా అన్నింట్లో రామాయణం తలమానికం. రామావతారం కంటే రామనామం చాలా ప్రాచీనమైంది. రామమంత్రం శరీరాన్ని, మనస్సును పవిత్రీకరించి, సంరక్షించి ఉత్తమ భవిష్యత్తుకు దారి చూపుతుంది. స్వామీజీ ద్వారా శాస్త్రిగారు రామ మంత్రంలోని ఆనందాన్ని చవిచూశారు. లౌకిక జీవితం కొనసాగిస్తూనే శ్రీరామునితో సంబంధాన్ని స్నేహాన్ని, భక్తిని పెంపొందించుకుంటూ చివరకు ఆ మంత్రం ద్వారానే సిద్ధి కూడా పొందారు.

వెలుగుబాటలో ప్రయాణించే సాధకుడికి ప్రారంభ దశలో దైవం పరిచయమవుతుంది. ఆ పరిచయం దినదిన ప్రవర్ధమానమయ్యే కొద్దీ దైవంతో అతని సంబంధం కూడా పెరుగుతుంది. తాను దివ్య సంకల్పానికి అనుగుణంగా వున్నానని తెలుసుకుంటాడు. దైవమొక్కడే పరిపూర్ణమని కూడా తెలుసుకుంటాడు. తనలో వున్న, తన చుట్టూ వున్న ప్రతి అణువణువుకూ

దైవంతో సంబంధం కల్పించడానికి ప్రారంభిస్తే ఆ దేవుడే అతనికి స్నేహితుడవుతాడు. అప్పుడు భగవంతుడితో వ్యవహరించడు, దివ్య సంకల్పం ప్రకారమే జీవితాన్ని గడపటం, ప్రతినిత్యం దైవానుభూతి పొందటం జరుగుతుంది. అందరిలోనూ గల దైవం అతడికి స్నేహితుడవుతాడు. అలా క్రమంగా దైవత్వం మాత్రం మిగిలి, మిగిలిన నామరూపాలు మాయమై దైవ సాక్షాత్కారం లభిస్తుంది. ఇది నాలుగంచెలుగా జరుగుతుంది. మొదటిది జిజ్ఞాస, రెండవది సాధన. మూడవది సిద్ధి, నాల్గవది ఊర్ధ్వలోక ప్రయాణం అంటే సాయుజ్యం.

శంభుడు క్రమంగా భక్తి, కర్మయోగాలలో ఆసక్తిని పెంచుకున్నాడు. విద్యార్థి వసతిగృహంలో పాత్రలు తోమటం లోను, భోజనశాలను శుభ్రం చేయటంలోను అందరి విద్యార్థులకంటే అతడే మేలన్న అభిప్రాయం స్వామీజీకి కూడా వుంది. శంభుడు దైవంపట్ల చూపిస్తున్న అచంచల భక్తి, సేవా భావనలో కూడా తన పాటవాన్ని పెంచుకుంటూ వున్న శంభుడిని గమనించిన స్వామీజీ సంతోషించి అతడికి భక్తి మార్గాన్ని పరిచయం చేశారు. (భక్తి మార్గమంటే భగవద్గీత, శ్రీమద్భాగ వతంలో చెప్పబడినట్లుగా లౌకిక ప్రపంచంలో జీవితాన్ని గడుపుతూ కర్తవ్యాలను నిర్వహిస్తూ దైవంతో ఏకమయ్యే సామర్థ్యాన్ని ఇవ్వగల యోగం.) అతడంతకు ముందే సుషుమ్న యందు కుండలినీ దర్శనం పొందినవాడు గదా! అందువలన

రామ నామం చేస్తూ, నామ రూప జగత్తుని రామునిగా దర్శనం చేయటం సులభమయింది.

శంభుడు ఎంతో శ్రద్ధగా చదువుకునేవాడు. అతని విద్యాభ్యాసం ఎలాంటి ఆటంకాలు లేకుండానే ముగిసింది. అయినప్పటికీ అతని లక్ష్యం శ్రీరామునిపైనే వుండేది. ప్రతి సంవత్సరం విద్యాలయంలో పరీక్షలయిన తరువాత సెలవులలో మద్రాసు నుండి తమ ఊరికి వచ్చేవాడు. బాపట్లలో దిగి నేరుగా మంగలివాడి దగ్గరకెళ్ళి సంప్రదాయానికి తగినట్లుగా తలవెంట్రుకలను, బట్టలను మార్చుకొని మర్రిపూడికి వెళ్ళేవాడు. ఆ వేషం చూచిన తల్లిదండ్రులు, గ్రామప్రజలు 'ఇతడే మాత్రం మారలేదు' అని సంతోషాన్ని ప్రదర్శించేవారు. 'ఇంగ్లీషు చదువులు చదువుతున్నా ఏ మార్పులేని మంచివాడు' అని పొగిడేవారు. శంభుడు ఈ తమాషా చూచి మనసులో నవ్వుకొనేవాడు. అయినా నిజం చెప్పాలంటే అతడు కూడా సంప్రదాయ సిద్ధమైన వేషభాషలనే ఎంతో ఇష్టపడేవాడు. (పూర్వపు అలవాటు). శంభుడు అన్నింటా తన నైపుణ్యాన్ని పెంచుకుంటూ తన వ్యక్తిత్వాన్ని కూడా అభివృద్ధి పరచుకుంటున్న సమయంలో అతనిలో జరుగుతున్న ఆత్మోన్నతిని తల్లిదండ్రులు గమనించారు. ఇప్పటి పరిస్థితులలో సరియైన జీవితం గడపటానికి అవసరమైన ప్రాచ్య పాశ్చాత్య సంస్కృతుల కలయిక కూడా శంభుడిలో సరియైన మార్గంలోనే వుండటంతో వారు తృప్తిపడి ఆనందించారు. కొడుకు

చదువు పూర్తయ్యాక శ్రీ జగన్నాథ శాస్త్రి గారు అతనికి 'నీవు చదువు ముగించి ఈ పల్లెకు తిరిగి రావటంతో ఏ అర్థమూ లేదు. అక్కడే వుండి నీ చదువుకు సంబంధించిన ఉద్యోగం కోసం ప్రయత్నించు' అని ఉత్తరం వ్రాశారు. తండ్రి సలహా మేరకు శంభుడు 30 రూ॥ల జీతంతో ఒక ప్రైవేట్ సంస్థలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించాడు. అలా వృత్తి ధర్మం నిర్వహిస్తూ వుండగానే మద్రాసు ప్రభుత్వం ప్రజాహిత దృష్టితో మోటారు వాహనాలను పరిశీలించి రోడ్డుపై నడిపే వాహనాల స్థితిగతులను పరీక్షించడానికి 'వాహన పరిశీలనాధికారి' కోసం ఉద్యోగ ప్రకటన ఇచ్చారు. అక్కడున్నవి కేవలం నాలుగు పోస్టులు. ఆ రోజుల్లో (1940) ప్రభుత్వోద్యోగం అంటే హోదాకు, వైభవానికి సంకేతం. ఎందుకంటే ప్రభుత్వోద్యోగులకు సంఘంలో గౌరవ మర్యాదలు ఎక్కువగా లభించేవి.

సమాజసేవకు సంబంధించిన ఆ ఉద్యోగం తనకు తగినది అన్న ఆలోచన శంభుడికి కలిగింది. ఆ ఉద్యోగాన్ని పొందాలన్న ప్రగాఢమైన కోరికతో దానికి అప్లికేషన్ పంపాడు. శ్రీ స్వామీజీకి కూడా తాను చేరాలనుకున్న ఉద్యోగం గురించి, దానికోసం తాను చేస్తున్న ప్రయత్నం గురించి తెలిపాడు. 'నీ కోరిక నెరవేరుతుంది. శ్రీరాముడు నీకు తోడుగా వుంటాడు' అని స్వామీజీ ఆశీర్వదించారు. కొన్ని రోజుల తరువాత ఉద్యోగం కోసం ఎన్నుకున్న అభ్యర్థుల జాబితాలను ప్రకటించారు. అయితే

అందులో శంభుడి పేరులేదు. దానితో ఆయన మనసు దెబ్బ తిన్నది. చాలా నిరాశ చెందాడు. కాని అతని అంతరాత్మ అందుకు ఒప్పుకోలేదు. ఆ ఉద్యోగం తనకే రావాలనీ, ప్రభుత్వ నిర్ణయం తప్పని పదేపదే హెచ్చరిస్తూ వుండేది. అతడు ఏకాంతంలో రామునికి మొరపెట్టుకున్నాడు. తన గది తలుపులు బిగించి శ్రీరాముని ప్రార్థించడం ప్రారంభించారు. ఆహారము, నీళ్ళు, నిద్ర లేకుండా కేవలం ప్రార్థన మాత్రం ఎడతెగకుండా చేసేవారు. ఆ విషయాన్ని గురించి అంత తీవ్రంగా ఆలోచించ వద్దని, వదలిపెట్టమని స్నేహితులందరూ నచ్చచెప్పారు. అయినా శంభుడు వారి మాట వినలేదు. ఇది గమనించిన స్నేహితులు స్వామీజీకి విషయమంతా వివరించారు. స్వామీజీ వెంటనే శంభుడి దగ్గరికి వచ్చి ఎంతో అనునయించారు. స్వామీజీ మాటలను కూడా శంభుడు వినిపించుకోలేదు. ఇది తనకూ, తన ఇష్టదైవమైన శ్రీరామునికీ మధ్య జరుగుతున్న పోటీ అని తన ప్రశ్నకు సరియైన సమాధానం దొరికేదాకా ప్రార్థన, ఉపవాస సత్యాగ్రహాన్ని విడిచిపెట్టనని చెప్పాడు. ఇలా నిద్రాహారాలు లేక కేవలం ప్రార్థనలోనే మూడు పగళ్ళు, మూడు రాత్రులు గడిపారు. నాలుగవ నాటి ఉదయాన్నే వార్తాపత్రికలో ఉద్యోగానికి ఎన్నికైన అభ్యర్థుల జాబితాలో శంభుడి పేరు పొరబాటున ముద్రింపబడలేదని, ఆ పేరుగల వ్యక్తి సంబంధిత కార్యాలయాధికారి నుండి తమ పేరుతో వున్న ఉద్యోగ ఆర్డర్స్ పొందాలని ప్రకటించారు. ఈ విషయం చదివిన శంభుడి

స్నేహితుల ఆనందానికి హద్దులు లేవు. వారు వెంటనే పరుగెత్తి కెళ్ళి స్వామీజీకి ఈ విషయం తెలిపారు. స్వామీజీ హుటాహుటిని శంభుడి గదికి వెళ్ళి తలుపుకొట్టి, “శాస్త్రీ! దైవానికి నీకు జరుగుతున్న పోటీలో నీవే నెగ్గావు. నీకు ఉద్యోగం వచ్చింది. తలుపు తియ్యి” అని గట్టిగా పలికారు. శంభుడు మెల్లగ తలుపులు తెరిచి, వార్తాపత్రికను చూచి, కళ్ళ నుండి నీరు జాలువారుచుండగా స్వామీజీ పాదాలకు నమస్కారం చేశాడు. అందరూ ఆనందంతో తన్మయత్వంతో రామగానం చేశారు. ఎంతో కృతజ్ఞతతో తన ఇష్టదైవమైన రాముడి ఫోటో వంక చూశాడు. ‘ఇది శ్రీరాముని ఆశీర్వాద ఫలమే. ఈ ఉద్యోగం ఆయన నాకిచ్చిన బహుమానం. ఉద్యోగం ద్వారా ప్రజాసేవ చేస్తాను కాని, నాకేదో హోదా వచ్చిందని ఎన్నటికీ భావించను. ఇది పరిపూర్ణ దైవానుగ్రహమని నేను భావిస్తాను’ అని అను కొన్నాడు. విద్యాలయానికి వెళ్ళి అక్కడి తన చదువుకు స్వస్తి చెప్పి ‘శ్రీశాస్త్రిగారు’గా ప్రజాసేవలో తమ జీవితంలోని మరో అధ్యాయంలోకి ప్రవేశించారు.

# 5

## 5. ప్రజాసేవ

**శ్రీ** శాస్త్రిగారు (శంభుడు) ప్రభుత్వ రవాణా సంస్థ కార్యాలయంలో పై అధికారిగా వుండి, 25 సంవత్సరాల ప్రభుత్వ సేవలో "హరే రామశాస్త్రి' గారుగా సంఘంలో స్థిరపడ్డారు. తమ పరిశ్రమ, కర్తవ్యంపట్ల శ్రద్ధ, నీతి, నిజాయితీల వలన ఎక్కడ పనిచేసినా ఆయన అందరి ప్రశంసలూ పొందేవారు. జిల్లాలో రహదారిపై వెళ్ళే వాహనాల రక్షణ, వాటి శక్తి, డ్రైవర్ల సామర్థ్యాలను సమర్థతతో గమనించడంతోపాటు, రాష్ట్ర ప్రభుత్వం వాహనాల రక్షణ కోసం ఏర్పరచిన నియమాలను అమలు జరపడంతో కూడా తమ వంతు కర్తవ్యాన్ని శ్రద్ధగా నిర్వహించే వారు.

ప్రభుత్వోద్యోగములో ఆయన సేవలు మార్పురానీకుండా 1942 నుండి 1967 వరకూ సంయుక్త మద్రాసు రాష్ట్రము మరియు ఆంధ్రప్రదేశ్‌లోని అనేక జిల్లాలలో సాగింది. ఆ కాలభాగం భారతదేశంలో ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక మరియు ఆధ్యాత్మిక రంగాలలో ఎన్నో మార్పులు జరుగుతున్న సమయం. శ్రీ శాస్త్రిగారు జరుగుచున్న మార్పులను గమనిస్తూ, తనయందలి విలువలను పాటిస్తూ, రహదారి నియమాలను

ప్రజోపయోగముగా అమలులోనికి తెచ్చారు. తమకు లభించిన ప్రభుత్వోద్యోగం రాష్ట్ర ప్రజల సేవకోసం ఆ భగవంతుడిచ్చిన సదవకాశమని తాను ప్రాణ ప్రదంగా ప్రార్థించి, పూజించి, ఆరాధించే శ్రీ మహావిష్ణువు యొక్క దశావతారాలలో ఒకడైన శ్రీరాముడు సంతోషపడేలా తమ కర్తవ్యాన్ని సక్రమంగా, సంతృప్తిగా, సంపూర్ణంగా నిర్వహించాలని మనసులో నిర్ధారించుకున్నారు. ఆ విధంగానే ఆసాంతము ఆయన జీవించారు. శాస్త్రిగారికి శ్రీరాముడే సర్వాంతర్యామి. ఆయన అందరిలో రామునే చూచేవారు. విశాల హృదయంతో దేనికీ వెనుకంజ వేయక తనతోటి వారికి సేవచేస్తూ అదే ఉత్తమమైన దైవకార్యమని భావించేవారు.

'మానవసేవయే మాధవసేవ' అని నమ్మిన శాస్త్రిగారు ఉద్యోగపరంగా, కుటుంబపరంగా, సామాజికపరంగా తాము నిర్వహించవలసిన కర్తవ్యములలో లీనమైనప్పటికీ అధ్యయనం, దైవప్రార్థన మరియు పరహితకార్యాలను ఎప్పటికీ వదలలేదు. ఆయన దైవప్రార్థన చేసేటప్పుడు ఆ దేవుడు తనలోనే వున్నాడని భావించేవారు. ఆ సమయంలో అక్కడున్న వారికి కూడా అలాంటి అనుభూతే కలిగేది. కీర్తన చేసేటప్పుడు ఆయన ఈ లోకాన్నే మరచి తన్మయంగా వుండేవారు.

తాము ఉద్యోగరీత్యా కర్తవ్యాలను నిర్వహించి సమాజ ఋణాన్ని తీర్చుకుంటున్నాని ఆయన భావించేవారు. ఎంతో

నైపుణ్యంతో కర్తవ్యాన్ని నిర్వహించే ఆయన తమ సహోద్యోగులకు ఆదర్శంగా, ప్రేరణగా నిలిచారు. ఆయన పేరు ప్రతిష్ఠలను చూసిన కొంతమంది ఈర్ష్యపడేవారు. ఎంతోమంది డ్రైవర్లు ఆయన చూపిన సోదరభావాన్ని, మార్గదర్శకత్వాన్ని ఇంకా ఆయన చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రశంసించారు. కొందరు ఆయనను ఆరాధించారు కూడా. రాష్ట్ర ప్రభుత్వం తమకు ఎన్నో అధికారాలనిచ్చినా, వాటిని ఎంతో అవసరమైతేనే ఉపయోగించే వారు. దుర్వినియోగమెన్నడూ చేయలేదు.

శ్రీ శాస్త్రిగారు ఎంతోమంది డ్రైవర్లలో మంచి మార్పును తెచ్చారు. బస్సు లేదా లారీలలో ప్రయాణీకులను కాని, సరకులను కాని మితిమీరి ఎక్కిస్తే వారికున్న లైసెన్స్ తీసివేసే అధికారం తనకు వున్నప్పటికీ ఆయన ఆ అధికారాన్ని ఉపయోగించకుండానే వారిని సరియైన దారిలోకి తెచ్చేవారు. తప్పు చేసిన డ్రైవర్‌ను పిలిచి లెంపలు వాయించి 'ఇలాంటి నీచానికి ఎందుకు ఒడిగట్టావు? దీనితో నీవు, నీ కుటుంబం రోడ్డుపై భిక్షమెత్తవలసి వుంటుంది. ఇలాంటి తప్పును మరెప్పుడూ చెయ్యకు' అని సలహా ఇచ్చేవారు. ఇలా తప్పు చేసిన వారిని విచిత్రంగా శిక్షించేవారు. శిక్షింపబడ్డ వారిలో కొందరు డ్రైవర్లు దిట్టంగా బలంగా వుంటే మరి కొందరు విపరీతమైన కోపం గలవారు కూడా వుంటారు. అయినప్పటికీ ఆయన ముందు నోరు మెదిపేవారు కాదు. ఆశ్చర్యమేమంటే ఆయనచేత శిక్షింపబడ్డ వాడెవ్వడూ ఆయనకు

ఎదురు తిరుగలేదు! చెంపదెబ్బ తిన్న తరువాత నియమాను సారంగా నడిచేవారు. ఇంకా విశేషమేమంటే వారందరూ భక్తి మార్గంలోకి మళ్ళేవారు! ఆయన చేత శిక్షింపబడినప్పటికీ ఆ చేతిలో ఏదో మహాత్మ్యముందని, ఆయన కొట్టిన చెంపదెబ్బతో జీవితమే మారిపోయిందని, అది మాకు శిక్షకాదు, శిక్షణ అని, ఆయన కొట్టిన దెబ్బతో అద్భుత శక్తుల స్పర్శ కూడా వుందని' చెప్పేవారు. 'మేము', మా కుటుంబాలు ఆయనకు ఎప్పటికీ ఋణపడి వుంటాము. ఎందుకంటే మేము తప్పు చేసినా ఆయన మమ్ములను పనిలో నుండి తీసివేయలేదు' అని చెప్పేవారు. ఇలా శాస్త్రిగారు ఎన్నో వందల డ్రైవర్ల, కండక్టర్ల జీవితాలను కాపాడి వారికి ఇంటిదీపమయ్యారు.

శ్రీరాముని అనన్య భక్తులు, సహజయోగి అయిన శ్రీ శాస్త్రి గారు తమ వాహనంపై కలి సంహారక మంత్రమైన –

హరే రామ హరే రామ
రామ రామ హరే హరే
హరే కృష్ణ హరే కృష్ణ
కృష్ణ కృష్ణ హరే హరే

అన్న మంత్రాన్ని వ్రాయించారు. కలియుగ ప్రభావాన్ని నివారిస్తుందనే ఆ మంత్రాన్ని 'కలి సంతారక మంత్రం' అని పిలిచేవారు. ఇది కలియుగంలో అత్యంత లోకప్రియమైన మంత్రం. ఎన్నో వేల సంవత్సరాల నుండి భారతీయులు ఈ

మంత్రాన్ని జపిస్తున్నారు. ఈ మంత్ర ప్రభావంపై శాస్త్రి గారికి ఎంతో నమ్మకం వుండేది. వారిని చూచి వారి ఆదరాభిమానాలు పొందటానికి, బస్సు యజమానులు, లారీల యజమానులు బస్సులలోనూ, లారీలలోను ఆ మంత్రం వ్రాసేవారు. వాటిలో ప్రయాణం చేసే ప్రజలంతా ఆ మంత్రానికి ఆకర్షితులయ్యేవారు. అలా 'కలి తారక' మంత్రం, ఆయన వాహికగ ఆంధ్రదేశమంతా వ్యాపించింది. వారు "హరేరామ్" ఆర్.టి.ఓ.గా ఆంధ్రుల హృదయంలో నిలిచిపోయారు. ఆయన ఊపిరిలో రామనామం నిరంతరం సాగుతూ వుండేది. రాముడే ప్రజల రూపంలో ఆయనకు "హరేరామ్" శాస్త్రి అని బిరుదును ప్రసాదించాడు.

నవయుగ ఆధ్యాత్మిక చైతన్య ప్రభంజనమూర్తి ఎక్కిరాల కృష్ణమాచార్యుల వారు (మాస్టర్ ఇ.కె.) శ్రీ శాస్త్రిగారిని గూర్చి యిలా అన్నారు.

*"నిరంతర శ్రీ సీతారామ చరణ సేవా మారుతి, హరే రామ కలి సంతరణ మహా యజ్ఞ స్వరూపులు, నిరంతర పుణ్య జీవనులు, కైలాసవాసి"*

వారాంతపు రోజులైన శని, ఆదివారాలలో ఇంకా జ్యోతిష్య దృష్ట్యా ముఖ్యమైన పర్వదినాలలోనే ఈ కలిహరణ మంత్రాన్ని ఇరవై నాలుగు గంటల కాలం ఏకాహంగా జపించేవారు. సామూహికంగా మంత్రజపం జరిగేది. ఇలా ఏ కష్టమూ లేకనే 'భక్తి ఉద్యమం' ప్రారంభమైంది. ఏకాహములు,

సప్తాహములు అనాయాసంగా అవి మహోత్సవములుగ సాగేవి. అందరికి భోజనములు, టీ, కాఫీ పానీయములు, ఉపాహార ములు రకరకాల రాగాలలో "హరేరామ" కీర్తన సాగేది. శ్రీరామ భక్తులైన అవధూతేంద్ర సరస్వతీ స్వామి తరచూ శిష్య బృందంతో సహా విచ్చేసి శాస్త్రిగారి సప్తాహములను పరిపూర్ణం గావిస్తూ వుండేవారు.

శ్రీ శాస్త్రిగారు తమ తాతగారివలె దైవీ కార్యక్రమము లను, అన్నదాన కార్యక్రమములను తరచూ గావిస్తూ వుండేవారు. వారు సహజముగ భోజనప్రియులు. అందువలన చాలా ప్రీతిగ భోజనముల నేర్పాట్లు గావించెడివారు. ప్రియముగ భోజనము చేయగలవారే, ప్రియముగ భోజనము పెట్టగలరు. ప్రియముగ దైవమును ప్రార్థించువారే ప్రియముగ దైవస్ఫూర్తి నందింపగలరు. ఈ రెండు లక్షణములు శ్రీ శాస్త్రిగారిలో మెండుగ వుండెడివి.

ఆయన ఒక నిండు విగ్రహము. ఆయన మాట గంటవలె ఖంగున మ్రోగెడిది. ఆయన పాట హృదయములను కరిగించెడిది. ఆయన పద్యగానం ముగ్ధులను చేసేది. పునర్వసు నక్షత్రమునందు కార్తీకమాసంలో జన్మించిన ఒక రామ కిరణ మాయన.

శ్రీ శాస్త్రిగారు తమ బుద్ధి కౌశల్యంతో తమకున్న అధికారాలను ఉపయోగించుకొని సమాజ సేవలోనే కాలం గడిపారు. ఆయనకున్న అధికారాలకు, హోదాకు ఎన్నో వాహన

సంస్థలను పర్యవేక్షించే అధికారం కూడా వుండేది. అలాగే ఆ సంస్థల నుండి అనేక రకాలుగా లాభం పొందే అవకాశం కూడా వుండేది. ఇతర ఉద్యోగులు ఆ అధికారాన్ని ఉపయోగించు కొని శ్రీమంతులయ్యారు. కాని శాస్త్రిగారు అలాకాక ముక్కు సూటిగా, ధైర్యంగా వ్యవహరించి తమ కర్తవ్యాలను సంపూర్ణంగా, అందరికీ ప్రేరణ లభించేలా నిర్వహించేవారు. ఆయన సేవా భావాన్ని, అభిమానాన్ని చూసిన వాహన యజమానులు కూడా శాస్త్రిగారు కోరే విధంగా సహాయం చెయ్యడానికి సిద్ధపడేవారు. ఆయన ద్వారా సహాయం పొందినవారు ఆయనకు కృతజ్ఞతగా ధనాన్ని ఇవ్వడానికి ముందుకు వచ్చేవారు. శ్రీ శాస్త్రిగారు చట్టాన్ని మీరి ఎప్పుడూ ఎవరికీ ఉపకారం చేయలేదు. పై అధికారిగా ఆయన నియమాలను పూర్తిగా పాటించేవారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఆయన వారి ముందు 'నియమావళి' వుంచలేదు. వాహన యజమానులు శ్రీ శాస్త్రిగారి కోసం వ్యక్తిగత సౌకర్యాలను కల్పించడానికి ముందుకు వచ్చినా ఆయన ఎంతో మృదువుగా తిరస్కరించేవారు. ఎంతో బలవంతం చేస్తే 'మనదేశంలో వేలమంది బీద ప్రజలున్నారు. వారికెందుకు సహాయం చేయకూడదు. మీరు ప్రతినిత్యం చేసే దేవుడి పూజ కంటే, బీద ప్రజలకు సేవ చేస్తేనే భగవంతుడు ఎక్కువ సంతోషపడతాడు అనేవారు. ఈ మాటలను ఆయన ఎప్పుడూ చెప్పేవారు. ఇలా శాస్త్రిగారు వేరే వాళ్ళను కూడా సత్సంకల్ప కార్యాలను చేయడానికి ప్రేరేపించేవారు. అంతేకాక శ్రీ శాస్త్రిగారు వ్యక్తిగతంగా కూడా

'కష్టాలలో వున్న వారెవరు? వారికి ఎలాంటి సహాయం చేయాలి?' అని ఆలోచించి, సహాయం చేయడానికి ఇష్టపడి తన దగ్గరకు వచ్చేవారికి సలహాలిచ్చేవారు. ఆయన మాటలు హృదయానికి హత్తుకొని బీదప్రజల సేవ చేయడానికి చాలామంది పూనుకొనే వారు. శ్రీ శాస్త్రిగారి వద్ద ఎప్పుడూ, సహాయము వలసిన వారి చిరునామాలు వుండేవి. తన అభిమానులెవరైనా సహాయము చేయటానికి వస్తే, వారికా చిరునామాలలో కొన్నింటినిచ్చి, సహాయం నిర్వర్తింపజేసేవారు. అలా వందలాది పేద కుటుంబా లకు ఆయన అన్నము, బట్ట, విద్య, వివాహముల విషయములో ఆదుకొని, ఆప్తబంధువయినారు.

అందువల్ల అనుకోని విధంగా శాస్త్రిగారంటే ప్రజలలో అభిమానము, గౌరవం పెరిగింది. బీద ప్రజల సహాయమే ఆయన జీవనధ్యేయం. ఆయన ఏ పని చేసినా ప్రశాంతంగా, సరళంగా, మౌనంగా చేసేవారు. శ్రీ శాస్త్రిగారి నుండి సహాయం పొందినవారు ఇప్పటికీ వారిపట్ల తమ కృతజ్ఞతను చూపిస్తూనే వున్నారు.

తమ జేబులో ఎప్పుడూ సహాయార్థుల చిరునామా లుంచుకొని సమయం దొరికినప్పుడలా వారికి సహాయం చేసే శాస్త్రిగారికి సమఉజ్జీలు బంధువులలో గాని, స్నేహితులలో కాని లేరు. సేవాభావానికి, అభిమానానికి, ఆదరానికి ఆయన మారుపేరు. సమయానికి తగినట్లుగా ఉత్తమ స్నేహితుల్లా

మెలిగేవారు. ఎన్నోసార్లు ఆయన గుప్త సహాయం చేసేవారు. ఎవరికి, ఎప్పుడు, ఎలా సహాయం చేసిందీ ఆయన భార్యకు కూడా తెలిసేది కాదు. తనలోని మంచి గుణాలను, సత్సంకల్ప కార్యాలను బయటికి తెలియనీయకుండానే గోప్యంగా నిశ్శబ్దంగా నెరవేర్చేవారు. మంచి పనులను ముందుగా చేసి ఆ తరువాత బయటికి చెప్పే కార్యవాది. రవాణా సంస్థలో నియమాలను అమలుపరచి ఆ ప్రదేశంలో తనదైన శాశ్వత చిహ్నాలను నిలిపారు. వృత్తి నిర్వహణలో తమకు లభించిన కీర్తి ప్రశంసలకు ఆ శ్రీరాముడే కారణమని, తాను శ్రీరాముడికి వినమ్ర సేవకుడనని భావించేవారు. వారు నిగర్వి.

# 6

## కుటుంబ జీవితం

సత్సంప్రదాయ కుటుంబానికి చెందిన 'రామలక్ష్మి' అనే కన్యను శాస్త్రిగారు వివాహం చేసుకున్నారు. రామలక్ష్మి గారి తండ్రి కుండలినీ యోగ సాధకులు. అంతేకాక శ్రీరాముని అనన్య భక్తులు. తపస్సుగా భావించి ముప్ఫై ఏళ్ళలో ముప్ఫై దశలక్షల సార్లు (3 కోట్లు) రామనామాన్ని వ్రాశారు. శ్రీ శాస్త్రిగారి వివాహం పెద్దల ఇష్టప్రకారమే, వారి ఆధ్వర్యంలోనే జరిగింది. శాస్త్రిగారి తండ్రి జగన్నాథశాస్త్రిగారికి రామలక్ష్మి తండ్రి గారింట్లో జరుగుతున్న ఆధ్యాత్మిక సాధన గురించి తెలిసి ఇలాంటి కుటుంబంలోని అమ్మాయే కావాలని నిర్ణయించుకొని వారి వివాహానికి ఒప్పుకున్నారు. పెళ్ళప్పటికి శాస్త్రిగారికి ఇరవై ఏళ్ళు. రామలక్ష్మి గారికి పధ్నాలుగేళ్ళు. విజయవాడలో శాస్త్రోక్తంగా పెళ్ళి జరిగింది. తరువాత మద్రాసు పట్టణంలో కాపురం పెట్టారు. ఉద్యోగరీత్యా వచ్చే బదిలీల కారణంగా సేలం, విశాఖపట్టణం, ఏలూరు, రాజమండ్రి, విజయవాడ, అనంతపురం, కడప, నిజామాబాద్ పట్టణాలలో కూడా పనిచేశారు. శ్రీమతి రామలక్ష్మి కూడా, భర్తకున్న ఉన్నతాశయ సిద్ధికోసం, శాస్త్రాధ్యయనంలో తమ పూర్ణసహకారాన్ని అందించే

వారు. ప్రతిరోజూ రాత్రి పనంతా అయ్యాక శాస్త్రిగారు ఆమెకు శ్రీమద్భాగవతంలోని గంభీర రహస్యాలను సులభంగా అర్థ మయ్యేలా బోధించేవారు. అలాగే ప్రతిరోజూ ఒక గంటసేపు భాగవతంలోని పద్యాలను పఠించేవారు. శ్రీమతి రామలక్ష్మమ్మ గారు శ్రీ శాస్త్రి గారికి అనుకూలవతి యగు భార్యగా, చేదోడు వాదోడుగా వుండేవారు. ఆమె భర్తనుండి భక్తి మార్గమును, తండ్రిద్వారా కుండలినీ యోగమును ఉపదేశము పొందిన అదృష్టవతి. దీర్ఘకాలముగ భక్తి, యోగ మార్గమున నిలచిన స్థిర చిత్తురాలు. ఏడుగు పిల్లలను కని, తీరువుగ పోషించిన చక్కని గృహిణి – ధనాశ, కీర్తికాంక్ష లేని ఇల్లాలు. శ్రీ శాస్త్రిగారికి అన్ని విధాల తగిన భార్యగా మెలిగిన స్త్రీ మూర్తి.

తమ గృహస్థ జీవితంలో శాస్త్రిగారు ఏడుగురి పిల్లల తండ్రయ్యారు. అందులో ఆరుగురు అబ్బాయిలు, ఒక్కతే అమ్మాయి. శ్రీమతి రామలక్ష్మి ఎలాంటి గర్భదోషములూ లేక ఆరోగ్యవంత మైన బిడ్డలను కన్నది. ఆ పిల్లలందరూ మాట తీరులోనూ, ప్రవర్తనలోనూ ఒకే భావంతో వుండి పరస్పరం స్నేహితుల్లా మెలిగేవారు. ఇంటి యజమాని శ్రీ శాస్త్రిగారు కూడా తాము ఆదర్శంగా వుంటూ తమ పిల్లలు తమను చూచి నేర్చుకునేలా పిల్లలకు భక్తి భావాలను నేర్పేవారు. క్రమశిక్షణను కూడా కేవలం మాటలతో కాక ఆచరణతో చూపారు. తాను తండ్రి అన్న అధికారాన్ని పిల్లలపై ఎప్పుడూ చలాయించలేదు. జీవితాన్ని విభిన్న దృష్టి కోణాలలో చూపించి, జీవితమంటే

ఏమిటో నేర్పగల సామర్థ్యం గలవారు. తమకు ఎన్నో పనులున్నా, కొంత సమయాన్ని పిల్లలతో గడిపేవారు. వారితో తాము కూడా క్రికెట్, కేరమ్స్, చదరంగం లాంటి ఆటలను ఆడేవారు.

అప్పుడప్పుడూ పిల్లలను పుణ్యక్షేత్రాలకు తీసుకెళ్ళేవారు. ఆయన నేర్పిన ధర్మబద్ధ జీవితం పిల్లలకు నిరంతర ప్రోత్సాహాన్ని ఇచ్చేది. ఏ విషయమైనా కుటుంబ సభ్యులందరూ చర్చించిన తరువాతే నిర్ణయాలు తీసుకునేవారు. ఆయన నిర్ణయాలను పిల్లలపై ఏనాడూ రుద్దలేదు. అధికార దర్పాన్ని చూపించక, తండ్రిలా కాక, పెద్దన్నయ్యలాగా, స్నేహితుడిలాగా వ్యవహరించేవారు. తమలోని భావాలను ప్రేమగా అమలుపరచే వారు. ఆ సమన్వయ భావాన్ని చూచిన అందరూ ఆదరంతో ఆయనను అభిమానించే వారు. ఆయన పిల్లలను విడివిడిగా పిలిచి ఏనాడూ సలహా లివ్వలేదు. కేవలం సిద్ధాంతాలపై, మాటలపై నమ్మకం లేని శాస్త్రిగారు ఉదాహరణాత్మకంగా, ఆచరణాత్మకంగా శిక్షణ నిచ్చేవారు. భార్య ఎప్పుడైనా ఆయనతో 'పిల్లలు ఎవరెవరు ఏం చేస్తున్నారో ఒక్కనాడైనా విచారించారా?' అని ప్రశ్నిస్తే దానికి చిరునవ్వుతో "వాళ్ళు మన పిల్లలు. మనలో ఏయే గుణాలు వున్నాయో వాళ్ళలో కూడా అవే గుణాలు వుంటాయి. నేను నిష్ఠావంతుడినైతే వాళ్ళు అలాగే తయారవుతారు. నేను దుష్టుడినైతే వాళ్ళు కూడా అలాగే తయారవుతారు. ఎందుకంటే వాళ్ళు నా ద్వారా వచ్చినవాళ్ళే కదా! నా జీవిత సందేశమేమిటో వారి జీవితం ద్వారా తెలుస్తుంది. మాటలతో ఇచ్చే సూచనలు

నిస్సారంగా నిష్ప్రయోజనంగా వుంటాయి. ఆచరణే ప్రత్యక్ష శిక్షణ. నేనేమిటో నాకు తెలుసు. అలాగే వాళ్ళేమవుతారో కూడా నాకు తెలుసు. వాళ్ళు తమ జీవితంలో ప్రయోజకులైన పౌరులుగా తయారవుతారు. వాళ్ళ భవిష్యత్తు గురించి నీవు చింతించకు. వాళ్ళకు ఉత్తమ మార్గదర్శకత్వంతో పాటు, రక్షణ కూడా వుంది. వాళ్ళ సంకల్పాల నుండే వాళ్ళకు జ్ఞానోదయ మవుతుంది" అని చెప్పేవారు.

నిజానికి శాస్త్రిగారి ఈ మాటలెంత సత్యమో ఆయన దేహం వదలిన తర్వాత మాష్టరు ఇ.కె. గారు పలుకుల్లో తెలుస్తుంది. మాష్టరు గారు శాస్త్రిగారి కుమారులలో ఒకరితో 1967లో యిలా అన్నారు. *"మీ నాన్నగారు రామ నామంతో మీ అందరికి రక్షణ కల్పించారు. ఆ రక్షణ కంచుకోట వంటిది. మీరందరూ వృద్ధిలోకి వస్తారు. వారి తపస్సు మీ యందు ఫలిస్తుంది".*

ఒకసారి శాస్త్రిగారి అబ్బాయిలలో ఒకడు విశ్వ విద్యాలయంలో చదువుతున్నప్పుడు స్నేహితుడు ఇచ్చిన సిగరెట్ కాల్చాడు. ఇంటికి వచ్చాక తల్లిదండ్రులపట్ల స్నేహం, చనువు గలవాడవటంతో ఎలాంటి దాపరికమూ లేక తాను సిగరెట్ కాల్చిన విషయం తల్లితో చెప్పాడు. కొడుకు మాటలను విని భయపడ్డ తల్లి వెంటనే ఈ విషయాన్ని ఆయనకు తెలియజేసింది. శాస్త్రిగారు రెండు నిమిషాల పాటు మౌనంగా కళ్ళు మూసుకొని తరువాత 'నేను తండ్రిగా నేర్పవలసినదంతా నేర్పాను.

ఇవ్వగలిగినదంతా ఇచ్చాను. ఇప్పుడు వాళ్ళు పెద్దవాళ్ళయ్యారు. తాము చేస్తున్న పనేమిటో వాళ్ళే తెలుసుకొని తమ తమ కర్తవ్యాలను నిర్వహించాలి. వాళ్ళకున్న మనోబలంతో, బలహీనతలను గెలవగలరన్న విశ్వాసం నాకుంది' అన్నారు. తండ్రి అన్నమాటలు కొడుకు మనసుకు బలంగా తగిలాయి. ఆ తరువాత ఆయన ఎంతో స్వేచ్ఛ నిచ్చినప్పటికీ ఆ అబ్బాయి మరెప్పుడూ సిగరెట్ ముట్టలేదు.

శ్రీ శాస్త్రిగారిని అభిమానించే బంధుమిత్రులందరూ సమయం దొరికినప్పుడల్లా 'అయ్యా! శాస్త్రిగారూ! ఏడు మంది పిల్లలు, భార్య వున్న పెద్ద కుటుంబం మీది. మీరు చూస్తే అతి ఉదార స్వభావులు. మీ పిల్లల భవిష్యత్తుకోసం, ఆస్తి కూడబెట్టే ఆలోచన చెయ్యండి. మీ సహోద్యోగులందరూ శ్రీమంతులయ్యారు. కాని మీరు మాత్రం ఈ విషయంలో ఆవగింజంతైనా ఆలోచించడం లేదు. జీవితం గడపటానికి డబ్బు కూడా కావాలి కదా! దయచేసి ఈ విషయం గురించి కూడా కాస్త ఆలోచించండి' అని సలహా ఇచ్చేవారు. వారి మాటలన్నీ ఓపిగ్గా విన్న శాస్త్రిగారు నవ్వుతూ, నా బిడ్డలే నా ఆస్తి. అదీకాక నాకు ఏ సంపదా, ఏ ఆస్తీ అవసరం లేదు. అక్రమ మార్గాలలో డబ్బు సంపాదిస్తే అది ఆనందాన్నివ్వక కేవలం దుఃఖాన్నే ఇస్తుంది. మీకు నాపై వున్న అభిమానానికి ఎంతో కృతజ్ఞతలు' అని జవాబిచ్చేవారు. అలా ఎంతోమంది, ఎన్నోసార్లు, ఎన్నో విధాలుగా సలహాలిచ్చినా ఆయన నుండీ వచ్చే సమాధానమిదే. ఆయన తమ పిల్లలతో

కూడా 'నా నుండి మీకు సంపద లేక ఆస్తి వస్తుందన్న ఆశ పెట్టుకోకండి. మీకు లభించే పిత్రార్జితమైన ఆస్తి వెలుగుబాటలో నడవటానికి కావలసిన జ్ఞాన మొక్కటే. మీ చదువు పూర్తయ్యేదాకా నేను మిమ్ములను పోషిస్తాను. ఆ తరువాత మీరు మీ కాళ్ళపై నిలబడాలి. మా నాన్న ఇలాగే చేసేవారు. నేను కూడా దాన్నే అనుసరిస్తాను. స్వావలంబ జీవితాన్ని గడుపుతూ ఇతరులకు సేవ చేయడం నేర్చుకోండి' అన్నారు. పిల్లలకు తండ్రిద్వారా స్పష్టమైన సందేశం లభించింది. దాన్ని గ్రహించిన పిల్లలు స్వయంపోషణకు స్వావలంబనతో పరోపకార జీవితాన్ని గడపటానికి నిశ్చయించుకున్నారు.

శాస్త్రిగారు కుటుంబ సభ్యులందరితో కలిసి తీర్థయాత్రలకు వెళ్ళటానికి ఇష్టపడేవారు. ఆయన ఎప్పుడూ బృంద జీవితం గడపటానికి ఇష్టపడేవారు. అందులో భాగంగా శ్రీరాముని పుణ్యక్షేత్రమైన భద్రాచలాన్ని దర్శించటానికి రాజమండ్రి నుండి గోదావరి నదిలో పడవ ప్రయాణం చేశారు. భద్రాచల రాముడంటే శ్రీ శాస్త్రిగారికి మహాప్రీతి. ఎన్నో కుటుంబాలను వెంటబెట్టుకుని గోదావరీ నదిలో ప్రయాణం చేసి భద్రాచలం వెళ్ళడం ఆయనకు సరదా. ప్రయాణంలో ఇసుక తిన్నెల వద్ద పడవలను ఆపటం, భోజనాలు వండుకు తినడం, భజనలు చేయటం చాలాసార్లు చేసేవారు. తీర్థ యాత్రలు, భజనలు వాటితోపాటు టెన్నిస్, బ్రిడ్జ్ మొ॥ ఆటలు ఆడటం, ఇవే ఆయనకున్న అలవాట్లు.

# 7

## భగవంతుడితో అనుసంధానం

శ్రీ శాస్త్రిగారి ఆస్తిక్యం క్రమంగా పరిపూర్ణ స్థితిని చేరసాగింది. ఆయనకు భగవంతుడే స్నేహితుడు, మార్గదర్శకుడు, దిగ్దర్శకుడు, సంరక్షకుడు కూడా. భగవంతునిపై ఆయనకు గల విశ్వాసం అపారం. వేరే వాళ్ళతో వుండటం కంటే దైవంతో వుండటానికే ఎక్కువ ఇష్టపడేవారు. నరుడిని, నారాయణుని సమానంగా ఆదరించేవారు. ఆయన తమ జీవితంలో ప్రార్థన లేకుండా ఒక్కరోజు కూడా గడపలేదు. భక్తికి సంబంధించిన ఆరవ కిరణం, అభివ్యక్తికి సంబంధించిన ఒకటవ కిరణం ఆయనలో కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాయి. ఆయన ఏ పని చేస్తున్నా దైవకార్యం చేస్తున్నారన్న భావం గోచరమయ్యేది.

భారతదేశంలో బీదరికం విపరీతంగా వుండటంతో ప్రజలలో కర్తవ్యలోపం కూడా ఎక్కువగా వుండేది. పేదరికం కారణంగా దొంగతనాలు జరుగుతూ వుండటం చేత, ప్రజలు రాత్రిళ్ళు ఇళ్లకు తాళాలు వేసేవారు. వేరే వూరికి వెళ్ళవలసి వస్తే రెండు తాళాలు వేసేవారు. ఒకసారి శాస్త్రిగారు పది రోజుల సెలవు మీద కుటుంబంతో పాటు కారులో బెంగుళూరుకు

బయలుదేరారు. సుమారు అరవై కి॥మీ॥ దూరం ప్రయాణం చేశాక ఇంటికి తాళం వెయ్యలేదని గుర్తొచ్చింది. అందరూ తిరిగి వెనక్కి వెళ్ళి తాళం వేసి వద్దామని అనుకుంటూ వుండగా శాస్త్రిగారు “దైవానుగ్రహం వుంటే వీధినపడిన సంపద కూడా భద్రంగా వుంటుంది. అది లేనప్పుడు ఎంత కాపలా వున్నప్పటికీ దొంగలు పడి దోచుకుంటారు. దైవానుగ్రహం వుంటే అరణ్యంలో వున్నప్పటికీ బలహీనుడు సురక్షితంగా వుంటాడు. అలాగే దైవకరుణ లేకపోతే రాజభవనంలో, రక్షక భటుల మధ్యలో వున్నప్పటికీ మనిషి చావగలడు. మనిషి తాను పొందగలిగే, పోగొట్టుకొనే లేదా నిలుపుకొనే సంపద, ఆరోగ్యం, అతని వ్యక్తిగత కార్యాలపై ఆధారపడి వుంటుంది. ఎవరు ఏది నాటుతారో దాని ఫలాన్నే పొందగలరు. మన యోగ్యతకు తగినట్లుగా వుండవలసింది వుంటుంది. వుండకూడనిది వుండదు.” అందుకే మనం తిరిగి వెళ్ళవలసిన అవసరం లేదు. దీని పరిణామం ఏదైనా సంతోషంగా వుందాము. ప్రయాణం ముందుకు సాగిద్దాం. దైవ నిర్ణయం ఎలా వుంటే, అలా జరుగుతుంది’ అన్నారు. ఆయన తరచూ భాగవతంలోని యీ క్రింది పద్యం చదువుతూ వుండేవారు.

*ధనము వీధిపడిన దైవవశమున నుండు*
*పోవు మూలనున్ననైన*
*అడవి రక్షలేని యబలుండు వర్ధిల్లు*
*రక్షితుండు మందిరమున జచ్చు.*

ఆ తరువాత కుటుంబమంతా ఎలాంటి ఆందోళనా లేకుండా పదిరోజుల యాత్ర ముగించి తిరిగివచ్చారు. ఆశ్చర్యం! తాళం వేయని ఇంట్లో దొంగతనం కాని, దోపిడీ కాని జరుగలేదు.

ఏలూరు పట్టణంలో వున్నప్పుడు (1948) ఒకనాటి అర్థరాత్రి శాస్త్రిగారూ, కుటుంబ సభ్యులందరూ నిద్రలో వున్నారు. పక్కింట్లో నుండి వస్తున్న శబ్దం విని ఆయనకు మెలకువ వచ్చింది. లేచి చూశారు. దొంగలు తలుపుకున్న తాళాన్ని పగులగొడు తున్నారు. పదునుగా వున్న ఆయుధాలతో, గోడ వాకిలి కూడా పగులకొడుతున్నారు. ఆ ఇంట్లో వున్న పెద్దవాళ్ళు, పిల్లలు అసహాయంగా తమ కెవరైనా సహాయం చేస్తారేమోనని ఒక్కుమ్మడిగా గట్టిగా కేకలు పెడుతున్నారు. శాస్త్రిగారు చొక్కా తగిలించుకొని అక్కడికి పరుగెత్తారు. ఆ కాలనీలో మిగిలినవారు ఏమీ పట్టించుకోక వూరకే చోద్యం చూస్తూ వున్నారు. వారందరూ ఇంటి తలుపులు భద్రంగా మూసుకొని కిటికీలలో నుండి వింత చూస్తున్నారు. ఒకవైపు బలంగా వున్న నలుగురు దొంగలు తలుపు పగలగొడుతున్నారు. శాస్త్రిగారు ఒక్క ఉదుటున ఆ దొంగలవైపు పరుగెత్తి సింహంలా గర్జిస్తూ వాళ్ళను పట్టుకొని చెంపలు పగలగొట్టడం ప్రారంభించారు. ఆ చీకటి రాత్రిలో ఆయనకొట్టే దెబ్బలు ప్రతిధ్వనిస్తూ వున్నాయి. ఆ దెబ్బలకు దొంగలు భయపడి చేతిలోని ఆయుధాలను అక్కడే వదలి పారిపోయారు. తరువాత శాస్త్రిగారు ఆ ఇంటివాళ్ళకు ధైర్యం

చెప్పి ఓదార్చారు. అంతా అయ్యాక చుట్టుపక్క ఇళ్ళలోని వారందరూ బయటకు వచ్చారు. కొందరు ఆయన ధైర్యాన్ని మెచ్చుకుంటే, ఒంటరిగా దొంగలను ఎదిరించిన ఆయన సాహసాన్ని పొగిడారు. బలవంతులైన నలుగురు దొంగలూ కలిసి ఆయుధాలతో కొట్టి వుంటే శాస్త్రిగారి గతి ఏమయ్యేదని ఇంకొందరు మాట్లాడారు. కాని ఆయన దేవుడిలా వచ్చి తమ ధన ప్రాణ మానాలను కాపాడారని ఆ ఇంటివాళ్ళు మనస్ఫూర్తిగా ప్రశంసించారు.

శాస్త్రిగారు దొంగలను తరిమి ఆ ఇంట్లో వాళ్ళకు ధైర్యం చెప్పి, తాము తృప్తి పడ్డారు. చుట్టుపక్కలవాళ్ళు 'ఇంత సాహస కార్యానికి మీరెలా సిద్ధపడ్డారు?' అని అడిగితే 'అది దేవుడు చేసిన పని. నేను ఆయన చేతిలో ఒక సాధనాన్ని మాత్రమే' అన్నారు. 'మీరు ఒంటరిగా ఈ పని చేస్తున్నప్పుడు ఏమీ అనిపించలేదా? ఎలా చేయగలిగారు?' అన్న ప్రశ్నకు 'నేను ఎప్పుడూ ఒంటరివాడను కాను. భగవంతుడెప్పుడూ నాతోనే వుంటాడు. ఆయన శక్తే నా శక్తి' అని జవాబు చెప్పేవారు. 'తప్పుకు శిక్షవేసి, తప్పు చేసిన వారిని సరిదిద్దేటంత ప్రభావం ఆ చేతుల్లో ఏముంది?' అని ఎవరైనా అడిగితే 'ధర్మాన్ని రక్షించే శ్రీరాముడి శక్తి నా చేతుల్లో వుంది' అన్నదే ఆయన జవాబు. ఈ సంఘటన జరిగినప్పటికి శాస్త్రిగారు యవ్వనంలోనే వున్నారు. అప్పటికాయనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. తన భర్త

సాహసానికి ఆ ఇల్లాలు ఆశ్చర్యపోయింది. ఇంత జరిగినా శాస్త్రిగారు దైవీభావంలో స్థిరంగా వున్నారు. గొప్పలు పలుకలేదు.

1952 ప్రాంతంలో రాజమండ్రిలో గోదావరి నది అంతకు ముందెన్నడూ చూడనంత ఉధృతంగా ప్రవహింప సాగింది. అప్పట్లో అక్కడే పనిచేసేవారు. నీటిమట్టం ఊహకంద నంతగా పెరిగిపోతూ వుంది. అడ్డంగా వున్న ఆనకట్టను దాటి గోదారి తల్లి ఊరంతా జలమయం చేసింది. కాని శాస్త్రిగారున్న దానవాయిపేట ప్రాంతానికి మాత్రం రాలేదు. ఎంతో ధన నష్టం, ప్రాణ నష్టం జరిగింది దాన్ని 'జాతీయ విపత్తు'గా పరిగణించడమైనది. వెంటనే శాస్త్రిగారు కార్య రంగంలోకి దూకారు. స్నేహితులను, అభిమానులను వెంటబెట్టుకొని సేవా కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. పట్టణంలోని వివిధ భాగాలలో గల ఎంతోమంది ప్రజలను కాపాడారు. తమ ఇంటిచుట్టూ గుడిసెలు వేయించారు. ఎక్కడెక్కడి నుండో వచ్చిన వరద బాధితుల కోసం ఆహారధాన్యాన్ని సేకరించి వంట చేయించారు. రోగులకు మందులిప్పించారు. రోగుల సంఖ్య వేలల్లో వుంది. రోగ పీడితులకు హోమియో మందులను కూడా ఇచ్చారు. ఉప్పెన ఉధృతం తగ్గేదాకా వారందరూ శాస్త్రిగారి రక్షణ అనే గొడుగు నీడలో సురక్షితంగా వున్నారు. బాధితుల మనశ్శాంతి కోసం ఉదయం, సాయంత్రం భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భారీ ఎత్తున జరిగే వంట కార్యక్రమంలో వడ్డనలోను,

అంట్లు తోమడంలోను, వారందరూ కూడా ఉత్సాహంతో పాల్గొనేలా ప్రోత్సహించారు. వారందరూ ఆయనను ఆపద్బాంధ వుడని వేనోళ్ళ పొగిడారు. అందుకు ఆయన దేవుడొక్కడే ఆపద్బాంధవుడు. నేను కేవలం ఆయన చేతిలో ఒక సాధనాన్ని మాత్రమే' అనేవారు.

అదే సమయంలో శాస్త్రిగారి స్నేహితుడు, మృదు స్వభావుడూ అయిన హోమియో డాక్టరొకరు తన ఇంటి నిర్మాణం కోసం తెచ్చుకున్న సామానంతటినీ ఉప్పెనలో పోగొట్టుకున్నాడు. ఇంటిపని ప్రారంభించడానికి ఒకరోజు ముందే ఇలా జరిగింది. మధ్య తరగతి కటుంబం యొక్క ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే వుంటుంది. ఇల్లు కట్టాలంటే మాటలు కాదు. ఈ సంగతి శాస్త్రిగారికి తెలిసింది. ఆయన స్నేహితుని పిలిచి సంగతేమిటని విచారించారు. ఆ డాక్టరుగారు వినయవంతుడే కాక శ్రద్ధాసక్తులతో ప్రజాసేవ చేస్తూ సమాజంలో గౌరవదరాలను పొందారు. శాస్త్రిగారడిగిన దానికి సమాధానంగా "నాకోసం, కుటుంబంకోసం ఒక ఇల్లు కడదామని ప్రయత్నించాను. అయినా దైవ సంకల్పం మరోలా వుంది. అందుకు ఇక ముందు ఇల్లు కట్టాలన్న ఆలోచన చెయ్యను" అని అన్నాడు. ఈ దుర్ఘటనను ఆయన నిర్లిప్తంగా అంగీకరించడం చూసిన శాస్త్రిగారి మనసు కరిగింది. ఇలా కొన్ని రోజులు గడిచాయి. ఒకరోజు ఉదయాన్నే ఆ డాక్టరు గారి ఇంటిముందు, ఇంటి నిర్మాణానికి కావలసిన

ఇసుక, సిమెంటు, ఇటుకలు మొదలైనవన్నీ మోసుకొచ్చిన లారీలు నిలబడి వున్నాయి. డాక్టరు గారు ఆ డ్రైవర్లను విచారిస్తే 'ఇవన్నీ మీకే. అందుకే ఇక్కడికి తెచ్చాము. వీటిని ఎక్కడ దింపాలి?' అని ప్రశ్నించారు. డాక్టరు గారి ఆశ్చర్యానికి అంతులేదు. 'నేను ఈ సామాను పంపమని ఎవరికీ చెప్పలేదే! బహుశా మీకిచ్చిన చిరునామా పొరబాటై వుంటుంది' అన్నారు. 'కాదు మాకిచ్చిన చిరునామా ప్రకారమే ఇక్కడికి వచ్చాము అన్నారు ఆ డ్రైవర్లు. డాక్టరుగారు తిరిగి 'అవి తనకోసం కాద'ని అంటే ఆ డ్రైవర్లు' కాదు అవి తమ కోసమేనని, అవి దింపేదాకా తాము అక్కడినుండి ముందుకెళ్ళమని చెప్పి అక్కడే నిలబడ్డారు. చివరికి ఆ డాక్టరుగారు 'వీటిని ఎవరు పంపారు'? అని అడిగారు. అంతే. వారందరూ ఒక్కసారిగా 'హరేరామ శాస్త్రిగారు' అని జవాబిచ్చారు. ఆ మాట విన్న డాక్టరు గారు ఆశ్చర్యపడ్డారు అయిన ఆ డ్రైవర్లతో 'కాసేపు ఇక్కడే వుండండి నేను వెళ్ళి విచారించి వస్తాను' అన్నారు. దానికి ఆ డ్రైవర్లు కూడా ఒప్పుకున్నారు.

అప్పటికప్పుడే డాక్టరుగారు శాస్త్రిగారిని చూడటానికి వెళ్ళారు. ప్రార్థన, పూజ ముగించి వస్తున్న, తేజస్సుతో వెలుగుతున్న శాస్త్రిగారిని చూశారు. భారీవిగ్రహం, పొడుగు తగ్గ లావు, మంచి బంగారుఛాయ, విశాలమైన ఛాతీ, చూడటానికి సుకుమారంగా వున్నా దృఢమైన చేతులు, విశాలమైన నుదురు,

గోధుమ రంగులో చురుకుగా, దైవాన్వేషణ చేస్తున్నట్లుగా కనిపించే కళ్ళు ఆయన పవిత్రతను చెప్పకనే చెబుతున్నాయి. అలా తేజస్సుతో కనిపించే శాస్త్రిగారి రూపాన్ని దర్శించిన డాక్టరు గారికి అనిర్వచనీయమైన ఆనందం కలిగింది. శాస్త్రిగారు చిరునవ్వుతో తమ స్నేహితుని ఆహ్వానించి, కూర్చోమని చెప్పారు. డాక్టరు గారికి ఒక కప్పు పాలు తెప్పించారు. అంత ఉదయాన్నే తనను చూడటానికి రావటంలో గల కారణం ఏమిటని అడిగారు. డాక్టరుగారు అంతకు ముందు తమ ఇంటి దగ్గర జరిగిన విషయాన్ని వివరించి "శాస్త్రిగారూ! మీరెందుకిలా చేశారు" అని ప్రశ్నించారు. దానికాయన చిరునవ్వుతో దేవుడు దయామయుడు. మీలాంటి కర్తవ్యనిష్ఠ గలవారు సుఖంగా వుండాలన్నదే ఆయన కోరిక. సంకల్పం కూడా. మీకో ఇల్లు కల్పించాలని ఆయన సంకల్పించాడేమో! అందుకే మీకు కూడా ఇల్లు కట్టాలనే సంకల్పం కలిగింది. 'ఆయన' సంకల్పం ఆపదలను దాటిస్తుంది. అలాగే చివరికి జరిగేది కూడా ఆయన సంకల్పమే. భగవంతుడి నుండి వచ్చిన సహాయాన్ని స్వీకరించండి. ఇందులో నేను కేవలం ఒక పాత్రను మాత్రమే' అన్నారు.

డాక్టరు గారికి ఆనందంతో కళ్ళు నిండాయి. కన్నీళ్ళు చెంపలపై కారుతున్నా, నోటమాటరాక స్నేహితులైన శాస్త్రిగారిని గాఢంగా కౌగిలించుకొని ఇంటికి వెళ్ళిపోయారు. ఈ సంఘటన జరిగిన ఇరవై ఐదేళ్ళ తరువాత ఒకసారి డాక్టరుగారు శాస్త్రిగారి

కొడుకును కలుసుకున్నారు. అప్పటికే హరే రామ శాస్త్రి గారు దేహత్యాగం చేశారన్న సంగతి ఆయనకు ఇంకో స్నేహితుడి ద్వారా తెలిసింది. ఆయన కొడుకుతో మాట్లాడి శాస్త్రిగారు సత్సంకల్పంతో చేసిన సహాయం ఆయన శ్రీమతికి కూడా తెలియదు. మనలోని 'సత్సంకల్పాలు' ఎవరికీ తెలియకుండా ఆచరించాలన్నది ఆయన జీవన ధ్యేయం.

ఈ సంఘటనను ఒక్కసారి వెనక్కి తిప్పి పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన ఎన్నో విషయాలు తెలిశాయి. అదేమిటంటే ఆ సమయంలోనే శాస్త్రిగారు కూడా ఇల్లు కట్టాలని సంకల్పించారు. స్నేహితుడి పరిస్థితిని గమనించిన శాస్త్రిగారు తమ ఇంటికోసం తెప్పించిన సామానంతా డాక్టరు గారింటికి తరలించి 'స్నేహ ధర్మాన్ని' నిర్వహించారు. తమ అవసరాల కంటే ఇతరుల అవసరాలను గమనించి సహాయం చేసే ఉదార హృదయులు!

శ్రీ శాస్త్రిగారు విశాఖపట్టణంలో వున్నప్పుడు అక్కడికి నూటముప్పై కి॥మీ దూరంలో వున్న 'మల్లవరం' అనే పల్లెలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం అక్కడున్న కోనేటి నుండి ఒక పెద్ద నాగుపాము శివాలయంలో ప్రవేశించి శివలింగాన్ని చుట్టుకొని కూర్చుని వుంటుందన్న విషయం ఆయనకు తెలిసింది. అది దైవ స్వరూపమని అందరూ భావించారు. ఈ విషయం చుట్టుపక్కల గ్రామాలకంతా పాకింది. జనం తండోపతండాలుగా ఆ దేవాలయాన్ని చూడటానికి రావడం మొదలుపెట్టారు. శ్రీ

శాస్త్రిగారికి నాగుపాము అడపాదడపా కనిపించటము, ఆశీర్వదించటము పరిపాటే. కాని ఆ నాగుపామును తాను చూచినపుడు తాను పూర్తి భౌతిక స్ఫూర్తితో వున్నట్లు ఆయనకెన్నడు అనిపించ లేదు. భౌతిక స్పృహలోకి వచ్చేటప్పటికి శ్వేతనాగు అదృశ్యమయ్యేది. ఇపుడు నాగుపాము భౌతికంగా శివాలయంలో దైవము నాశ్రయించి వుండటం ఆయన నాకర్షించింది. శాస్త్రిగారు తమ కుటుంబంతో ఆ దేవాలయాన్ని, పవిత్రమైన నాగుపామును చూడటానికి బయలుదేరారు. దేవాలయంలో ప్రవేశించగానే నేరుగా గర్భగుడిలో ప్రవేశించాలన్న సంకల్పం కలిగిన శాస్త్రిగారు లోపలికి ప్రవేశించి ఆ నాగుపామును శివలింగం నుండి తీసుకొని తన చేతిలో ఎత్తి పట్టుకున్నారు. పాము కన్నులలోకి చూస్తూ రామనామం చెప్పసాగారు. పాము పడగ విప్పి శాస్త్రిగారిని తదేకంగా చూడటం మొదలుపెట్టింది. అక్కడ చేరిన భక్తులందరూ ఆశ్చర్యపోయారు. కుటుంబ సభ్యులు శాస్త్రిగారికేమైనా అపాయం కలుగుతుందేమో అని ఆందోళన చెందారు. ఆయన చేతిలో పామును పట్టుకుని భక్తి పూర్వకంగా దివ్య సంకీర్తనలను పాడుతూ వుంటే ఆ పాము పడగెత్తి ఆయననే సూటిగా చూస్తూ వుంది. ఆయన కుటుంబ సభ్యులతోపాటు అక్కడ చేరిన వారందరూ ఆ దృశ్యాన్ని చూచి ఆశ్చర్యపోయారు. తమ కుటుంబ సభ్యులతో 'ఈ పామును మీరు కూడా పట్టుకోండి ఇది ఏమీ చేయదు' అని ఎంత చెప్పినా భయంతో ఎవరూ ముందుకు రాలేదు.

పాము శాస్త్రిగారి చేతిలో వున్నప్పుడే కొందరు దాన్ని ముట్టి చూశారు. వారితో శాస్త్రిగారు 'పామును పాములాగే కనబడుతుంది. కాని కాస్త లోపలికెళ్ళి చూసేవారికి అన్నింటా దైవమే కనబడుతుంది' అన్నారు. భక్తులైన శాస్త్రిగారు 'భగవంతుడా! జీవసేవ చేయడానికి నాకు అవకాశం ఇవ్వు. నీ సేవ చేసే శిష్యులలో నాకు స్నేహాన్ని కలిగించు. ఆ స్నేహాన్ని పెంపొందించు. అన్ని జీవులపైనా అపార దయను చూపేలా నన్ను అనుగ్రహించు' అన్నదే శాస్త్రిగారి దైనందిన ప్రార్థన.

నీ పాద కమల సేవయు
నీ పాదార్చకులతోడి నెయ్యమును
నితాంతాపార భూత దయయును
తాపసమందార నాకు దయసేయ గదే !

అనే పద్యాన్ని ఆయన ప్రతినిత్యం గానం చేసేవారు. ఆయన ప్రార్థనను దేవుడు అంగీకరించాడేమోనన్నట్లుగా చిన్నతనం నుండే అలాంటి అవకాశాలను కల్పించాడు. జీవితాంతం వరకూ ఆయన ఇరుగు పొరుగులకు, స్నేహితులకు, బంధువులకు, బీదలకు, రోగులకు, దిక్కులేని వారికి సేవ చేసేవారు. తమ ఇంటికి వచ్చే అవధూతలనే కాక ఇంకా అనేక సాధువులను దర్శించి సేవ చేసేవారు. శ్రీరామకృష్ణాశ్రమ లక్ష్యమైన వివేకానందుడి బోధనల ప్రచార కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. 'జన సేవయే జనార్దన సేవ' అన్న భావం ఆయనది.

శ్రీ శాస్త్రిగారు జీవుల రూపంలో వున్న దేవుడిని పూజించమని సలహా ఇచ్చేవారు. దైవాన్ని ఆయన శ్రీరాముని రూపంలో పూజించారు. పేరు లేని రూపం లేని దైవాన్ని (నిర్గుణ బ్రహ్మ) పూజించడంకంటే పేరు, రూపంగల దైవాన్ని (సగుణ బ్రహ్మ) పూజించడానికి ఇష్టపడేవారు. "నామ రూపాలు గల దైవాన్ని ఆరాధించడం మంచి మార్గం. ఎందుకంటే దైవంతో మాట్లాడవచ్చు. వారి మాటలను వినవచ్చు. సంభాషణలు జరుపవచ్చు. అది ఎంతో వైభవోపేతమైన మార్గం. మనకు తోడుగా ఇంకొక వ్యక్తి వుంటాడు. నా అభిప్రాయంలో రెండవ మార్గం సుకుమారమైన మార్గమని" జ్ఞానులతో అనేవారు.

శాస్త్రిగారికి భగవంతుడు అత్యంత సన్నిహితుడైన స్నేహితుడయ్యాడు. ఆయన దైవారాధన చేస్తూ కళ్ళు మూసుకున్నప్పుడు ఆయనకు దేవుడు మాట్లాడుతున్నట్లుగా, ప్రత్యక్షమైనట్లుగా కనిపించేది. ఒక్కొక్కసారి దేవుడే తన ఎదురుగా నిలబడినట్లు, తనతో మాట్లాడినట్లు అనిపించి గంటలకొద్దీ సంకీర్తనలను పాడేవారు. శ్రీమద్భాగవతంలోని పద్యపఠనం గాయత్రీమంత్ర జపం, శ్రీరామమంత్రజపం ఆయన నిత్య ప్రార్థనలోని అంశాలు.

ఆయన దినచర్య ప్రార్థనతో ప్రారంభమై శాస్త్రాధ్యయనంతో కూడినదై ప్రార్థనతోనే ముగిసేది. తమ

వాహనాన్ని నడిపేటప్పుడు కూడా దేవుడి వైభవాన్ని కీర్తించేవారు. ధార్మిక సభలలో, దేవాలయాలలో దైవ సంకీర్తన చేసేవారు. ఆ కీర్తనలను వినేవారికి హృదయం పులకించేది. చాలామంది ఆయనను 'దైవోన్మత్తుడని', దివ్య సంకల్పాన్ని నెరవేర్చడానికి జన్మించినవాడని కొనియాడేవారు. ఇతరుల ఆలోచనలను, ప్రశంసలను, విమర్శలను పట్టించుకోకుండానే శ్రీ శాస్త్రిగారు దైవసాన్నిధ్యంలోనే తమ యాభై ఏళ్ళ జీవితాన్ని గడిపారు.

# 8

# ఊర్ధ్వలోక ప్రయాణం

దైవ ప్రజ్ఞతో శాస్త్రిగారి సంబంధం పరిపూర్ణ స్థితికి చేరుకుంటూ వుంది. నలభై తొమ్మిదేళ్ళ వయసులో అడుగుపెట్టాక మానవుని జ్ఞానార్జనకు ఐదు ప్రముఖ ఆటంకాలు ఎదురవుతాయి. అవి అవిద్య (మాయ), తాను యితరుల కన్నా ప్రత్యేకమన్న భావం, రాగ-ద్వేషములు మరియు చాలాకాలము జీవించాలన్న కోరిక. మానవుడికి జీవితంలోని ఆనందాన్ని అనుభవించడానికి ఆటంకాలు. ఈ ఆటంకాలలో 'జీవించాలన్న కోరిక'ను శాస్త్రిగారు ముందుగా త్యజించారు. తనకోసం తీర్చుకోవలసిన కోరికలంటూ ఏవీలేవు. ఆయనకు జీవితమొక ప్రవాహంలాగా అనిపించేది. అందులో వచ్చే ప్రతి సన్నివేశంలోనూ ఇతరులకు సహాయం చేయడానికి ముందుకు వచ్చేవారు. సేవారంగంలో ఆయనెప్పుడూ ముందుండేవారు.

శాస్త్రిగారు కోరికలకు, తిరస్కారాలకు అతీతంగా నిలచారు. ఆయన ఆస్తికులను కాని, నాస్తికులను కాని, తన ఆలోచనలను అంగీకరించమని వారిని కాని ఏనాడూ తిరస్కార దృష్టితో చూడలేదు. అందుకే ఆయన అందరికీ స్నేహితు

లయ్యారు. ఎలాంటి పరిస్థితులలో వున్నా ప్రశాంతమైన మనసుతో వుండటం వలన ఆయనతోబాటు వున్న వారు కూడా ఆనందంగా వుండేవారు.

బాల్యం నుండి శాస్త్రిగారు దైవీ ప్రజ్ఞలో వుండటం వలన 'నేను' అన్న అహంకార భావాన్ని దాటగలిగారు. మానవుడు అహంకారము కారణంగా దైవం నుండి విడిగా, దూరంగా వుంటాడు. దానితో అందరి ద్వారా కార్యనిర్వహణ చేసే 'ఒకే ప్రజ్ఞ' (దైవీప్రజ్ఞ) నుండి దూరమవుతున్నాడు. 'ఒకే ప్రజ్ఞ' మరియు 'ఒకే ప్రాణం' అన్న అంశమే అన్ని వైవిధ్యాలకు పునాది అని గుర్తించడమే నిజమైన ఆస్తిక్యం.

సంపూర్ణ జ్ఞానాన్ని పొందిన మానవుడు సత్యమార్గంలో ముందుకు సాగుతున్న కొద్దీ ఆస్తికత్వం ద్వారా వైవిధ్యంలో గల విశ్వాత్మ భావాన్ని గుర్తించగలగాలి. ఆస్తికత్వము, దైవీభావన 'ఒక్కడి'నే అనేకమందిలో చూసే జ్ఞానాన్ని ప్రసాదిస్తాయి. అలా కాకపోతే అభ్యాస క్రమంలో లోపముందని అర్థం. ప్రత్యేకత్వం స్వార్థానికి, అహంకారానికి మరియు ఇతరుల పట్ల పక్షపాతం వహించటానికి దారితీస్తుంది. పక్షపాతం అసూయకు, ద్వేషానికీ దారితీస్తుంది. ఇలాంటి గొలుసులు అతనిని అవిద్యలో పడేస్తాయి. శ్రీ శాస్త్రిగారు అందరిలోనూ, అన్ని రూపాలలోనూ దైవాన్నే చూసేవారు. ఆయనకు 'ఏకత్వం'లో గల సత్యం గోచరమైంది. దేవుడితో సంపూర్ణంగా అనుసంధానం చెంది క్రమంగా వ్యక్తిగత ఆలోచనలను వదలిపెట్టారు. ఆయనకు ఏ వ్యక్తి గురించి కూడా

పూర్వకల్పిత అభిప్రాయాలు వుండేవి కావు. దైవీ ప్రజ్ఞకు దగ్గరవుతున్న కొద్దీ ఆయన చుట్టూ వున్న 'అవిద్య' మాయమై జ్ఞానజ్యోతి వెలిగింది. దీని నుండి ద్వంద్వాలైన రాగ-ద్వేషములను, అహంకారం - అవిద్యలను దాటి దివ్యజ్యోతిలో వుండేవారు. ఆ జ్యోతి జీవితేచ్ఛ, కోరిక అనే సమస్యలను పరిష్కరించింది.

ఆయన తమ నలభై తొమ్మిదవ ఏటనే తమ 'జీవితేచ్ఛను', ఎవరిద్వారా తన జీవితం ప్రారంభమైందో ఆయనకు తిరిగి సమర్పించాలని నిర్ణయించుకున్నారు. ఆయన తన సంకల్పానికి అనుగుణంగా తాను జన్మించలేదని అలాగే తన ఇష్టానికి అనుగుణంగా తిరిగి వెళ్ళలేనన్న నిత్య సత్యాన్ని తెలుసుకున్నారు. చావు పుట్టుకలు రెండూ దైవ సంకల్పానికి అనుగుణంగా నెరవేరుతాయి. 'జీవించాలనే కోరిక'ను తలచుకొని నవ్వుకునే వారు. అందువలన ఆయన తీవ్రంగా సాధన చేస్తూ భౌతిక శరీరంలో జీవించడానికి బదులుగా దైవంతో జీవించడం ప్రారంభించారు.

ఎందరో వ్యక్తులు శరీరంలో జీవించడాన్ని గురించి ఆలోచిస్తారు. కాని జ్ఞానులు పాంచభౌతిక శరీరంలో వుండటం కంటే దివ్యజ్యోతిలో వుండటానికి ప్రాముఖ్యతనిస్తారు. శ్రీ శాస్త్రిగారి మనసులో జరుగుతున్న మార్పులను ఆయన స్నేహితులు గమనించారు. వారు 'మీరు ఎక్కువకాలం బ్రతికి వుంటే ఎక్కువ సేవ చేస్తూ మీరు నమ్మిన దైవాన్ని సంతోష

పెట్టవచ్చు. అంతేకాక మీపై ఆధారపడిన మీ కుటుంబానికీ ఇంకా ఇతరులకూ అనుకూలంగా వుంటుంది' అని సలహా ఇచ్చారు. అది విన్న శాస్త్రిగారు చిరునవ్వు నవ్వుతూ 'అందరికీ సహాయం చేసేవాడు 'వాడొక్కడే', 'వాడికోసం' పని చేయడానికి 'సాధు సైన్యం' వుంది. ఎవరికి ఎవరు సహాయం చేయాలో కూడా 'వాడే' నిర్ణయిస్తాడు. నా కుటుంబానికి సహాయం నేనేనన్న భావం నాకు లేదు. దైవం నన్ను ఈ శరీరంలో ఎంతవరకు వుంచుతాడో అంతవరకు ఆయనకు సేవ చేస్తాను. చేస్తూనే వుంటాను. నేను ప్రజలకు లభించే కీర్తి ప్రతిష్ఠలచే ఆకర్షింపబడి, ఎక్కువకాలం సేవ చేయాలన్న కోరిక నాలో లేదు. 'వాడి' సంకల్పం ఎలా వుంటే అలాగే జరుగుతుంది. 'వాడికి' ఇష్టమైతే ఇక్కడుంటాను. ఇష్టం లేకపోతే అక్కడుంటాను. నా సంకల్పమన్నది లేక అంతా వాడి సంకల్పంగానే నెరవేరనీ' అని స్నేహితులకు సమాధానం చెప్పేవారు.

శ్రీ శాస్త్రిగారికి తనను తాను పరిపూర్ణం గావించుకునే సమయం పూర్తయ్యింది. 'సంతోషీ సదా సుఖీ' అన్నట్లుగా ఆయన ఎప్పుడూ సంతోషంగా, సంతృప్తిగా వుండేవారు. తాము పుట్టి పెరిగిన ఊరి ప్రజలకు బాల్యంలోనే సేవ చేశారు. స్నేహితులకు, బంధువులకు తానున్న సమాజానికి సేవ చేశారు. శ్రీరామకృష్ణా శ్రమంలో విద్యార్థిగా వున్నప్పుడు కూడా సేవా కార్యక్రమాలను చేపట్టారు. భగవంతుడిపై పూర్ణ విశ్వాసంతో కార్యనిర్వహణ చేసేవారు. అందువలన ఆయన ద్వారా లభించే దైవీ స్పర్శ

యొక్క సుఖానుభూతిని ప్రజలందరూ అనుభవించారు. శ్రీ శాస్త్రిగారు ఇక తాను ఊర్ధ్వలోక ప్రయాణం చేయవలసిన సమయం దగ్గరికొచ్చిందని గ్రహించారు. అది 1967 మే నెల. వృషభరాశి వైశాఖ మాసపు శుక్లపక్ష అష్టమి ఘడియలు ముగిసే సమయం అప్పుడు కడప పట్టణంలో వుండేవారు. ఆయనకు గుండె పోటు వచ్చింది. అది తనకు 'పై నుండి వచ్చిన పిలుపు' అని ఆయన గ్రహించారు. డాక్టరును పిలిపించగా ఆయన శాస్త్రిగారిని పరీక్షచేసి 'గుండెపోటు తీవ్రంగా వచ్చింద'ని చెప్పి మందులు వ్రాసిచ్చారు. శుక్లపక్ష ఏకాదశి ఘడియలు పూర్తయి ద్వాదశి ఘడియలు సమీపించే సమయంలో అంటే మే 20, 21వ తేదీన శాస్త్రిగారికి మళ్ళీ గుండెపోటు వచ్చింది. ఆయన భార్యను పిల్లలను పిలిచి దేవుడి దగ్గరికి తిరిగి వెళ్ళే సమయం వచ్చింది. అందుకే నేను వెళ్తున్నాను. ఆ దేవుడే మిమ్ములను కాపాడతాడు. పంచ పాండవులను కన్న కుంతీదేవిని జ్ఞాపకం చేసుకో. పాండురాజు దేహత్యాగం తరువాత కుంతీదేవి దైవ సహాయంతోనే పిల్లలను పెంచి పోషించింది. దేవ దేవుడైన కృష్ణుడు తన సాన్నిధ్యాన్ని, అభయహస్తాన్ని ఎల్లప్పుడూ వారికి అందించాడు. ఆమెలాగే నీవు కూడా నీ కర్తవ్యాలను నిర్వహించు. నీకు, పిల్లలకు తోడుగా శ్రీరాముడు ఎప్పటికీ వుంటాడు' అని చెప్పారు. ఆ మాటలు విన్న శ్రీమతి రామలక్ష్మిగారికి దుఃఖం పెల్లుబికింది. ఆమె గట్టిగా ఏడువసాగారు. శ్రీ శాస్త్రిగారు మునుపటిలాగే అధికారయుతమైన సింహధ్వనితో 'రామనామం

జపించేవారు మాత్రం నా దగ్గర వుండాలి. ఏడవదలచుకున్న వారు వేరే గదిలో వుండవచ్చు' అన్నారు. ఈ మాటలలో అక్కడున్న వారందరూ స్మృతిలోకి వచ్చి రామనామ జపం ప్రారంభించారు. అలా రామమంత్ర జపం జరుగుతూ వుండగానే శ్రీ శాస్త్రిగారు అర్ధరాత్రి గడిచాక, తెల్లవారు ఝామున 2 గం॥లకు ప్రశాంతంగా, అనాయాసంగా దేహత్యాగం చేశారు. తెల్లవారగానే ఆయన భౌతిక దేహాన్ని విజయవాడకు తీసుకెళ్ళి పవిత్ర కృష్ణానదీ తీరంలో దహన సంస్కారానికి ఏర్పాటు చేశారు. అది మండు వేసవి. ఆ రోజు సూర్యుడు 120 డిగ్రీల ఫారన్ హీట్ వేడిమితో తన ప్రచండ ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. శ్రీ శాస్త్రిగారి పిల్లలు కాళ్ళకు చెప్పులు కూడా లేకుండా, తమ తండ్రి భౌతిక శరీరాన్ని ప్రత్యేకంగా అమర్చిన 'వెదురు శయ్య'పై వుంచి నదీతీరం వరకు భుజాలపై మోసి అగ్ని సంస్కారం చేశారు. ప్రజ్వలంగా జ్వలించే అగ్ని జ్వాలల మధ్య శాస్త్రిగారి కుడిచెయ్యి మోచేతిదాకా పైకి లేచి కుమారులను ఆశీర్వ దిస్తున్నట్లుగా అనిపించింది. ఆయన తమ పిల్లల మనసులోనే కాక ప్రజలందరి హృదయాలలోనూ గౌరవ స్థానాన్ని పొందారు. అదృశ్యంగా వున్నప్పటికీ ఆయన ఈనాటికీ ఎందరికో స్ఫూర్తిదాత. సింహంలా జీవించి, సింహగర్జన చేసి ఇప్పటికీ అనేకుల హృదయ సింహాసనాన్ని అధిష్ఠించారు. ఎన్నో హృదయ మందిరాలలో ఈ నాటికీ జీవించి వున్నారు శ్రీ శాస్త్రిగారు.

# 9

## ప్రశంసలు - బిరుదులు

*శ్రీ శాస్త్రిగారిని గురించిన ప్రముఖుల ప్రశంసలు :*

1. మునుగుతున్న జీవన నౌకను కాపాడి దరిచేర్చే ఏక-మానవ సైన్యం.
2. సరళ జీవితాన్ని గడిపేవారికి ఆయన గుప్త గురువులు.
3. మానవునిలోని జ్యోతిని ప్రశాంతంగా ప్రజ్వలింపచేసే సత్సంకల్ప యోధుడు.
4. జీవన సామ్రాజ్యంలో సింహంలా (రాజులా) జీవించినవాడు.
5. జీవన ప్రవాహంలోని ఆటుపోటులను ఎదుర్కొని మెరుపులా ప్రకాశించిన పవిత్రాత్మ.
6. దైవం కోసమే జీవితాన్ని గడిపిన మహాభక్తుడి కథ ఇది.
7. దైవభక్తికి, జీవుల సేవకు ప్రామాణికమైన జీవనం శ్రీ శాస్త్రిగారిది.

### శ్రీ శాస్త్రిగారికి లోకమిచ్చిన బిరుదులు

1. శంభుడు
2. ఆప్తబంధువు
3. ఆపద్బాంధవుడు
4. హరేరామశాస్త్రిగారు
5. నిగూఢ యోగి